PRGI Reg No -"APTEL/26/A1193

నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి...

శుభోదయ

ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి 01, సంచిక 49, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, గురువారం - 09 - ఏప్రిల్ - 2026 , వెల రూ.5/-

### పరారీలో ఖేడా : హైదరాబాద్‌లో పవన్ ఇంటి వద్ద బారికేడ్లతో భద్రత



హైదరాబాద్‌లోని పవన్ ఖేడా నివాసం వద్ద భద్రత

సీఎం హిమంత బిశ్వ శర్మపై ఆరోపణల కేసులో దర్యాప్తు

ఢిల్లీలోనూ సోదాలు చేపట్టిన అస్సాం పోలీసులు

### కాళేశ్వరం కమిషన్‌పై తెలంగాణ హైకోర్టు తీర్పు వాయిదా



# నా పాదయాత్రలో బాబుకి రోజుకో సినిమా

## మావిగన్‌పై మరోసారి వైఎస్ జగన్ కీలక వ్యాఖ్యలు

- చంద్రబాబు తెచ్చిన అప్పులన్నీ ఎవరి జేబుల్లోకి పోయాయి?
- వచ్చే ఏడాది నా పాదయాత్ర ప్రారంభం
- పాదయాత్రలో ప్రజలతో మమేకం అవుతాను
- మావిగన్ ప్రతిపాదనపై మరోసారి కీలక వ్యాఖ్యలు
- ఎప్పటిలాగే చంద్రబాబు తెచ్చిన ఎన్నికల మేనిఫెస్టో చెత్త బుట్టలోకి వెళ్లిపోయింది
- చంద్రబాబు తెచ్చిన అప్పులన్నీ ఎవరి జేబుల్లోకి పోయాయి?



తాడేపల్లి: దోచుకో.. పంచుకో.. తినుకో.. అనే కాన్సెప్ట్‌తోనే రాష్ట్రంలో చంద్రబాబు పాలన కొనసాగుతోందని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం తాడేపల్లిగూడెం నియోజకవర్గ పార్టీ కేడర్‌తో జరిగిన భేటీలో ఆయన కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. వచ్చే ఏడాది నా పాదయాత్ర ఉంటుంది. పాదయాత్రలో ప్రజలతో మమేకం అవుతాను. నా పాదయాత్ర ప్రారంభమైన తర్వాత వైఎస్సార్‌సీపీ శ్రేణులు చంద్రబాబుకు ప్రతిరోజూ సినిమా చూపించడం ఖాయం అని వైఎస్ జగన్ అన్నారు. ఎప్పటిలాగే చంద్రబాబు తెచ్చిన ఎన్నికల మేనిఫెస్టో చెత్త బుట్టలోకి వెళ్లిపోయింది. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ మోసాలుగా తేలిపోయాయి. మన ప్రభుత్వంలో తీసుకొచ్చిన పథకాలన్నీ చంద్రబాబు రద్దు చేశారు

## కేంద్ర జల సంఘానికి ఘాటుగా లేఖ రాసిన తెలంగాణ

- మీ మినట్స్‌తో మాకు తీవ్ర నష్టం
- జల వివాదాల కమిటీ సమావేశ మినట్స్‌ను రికార్డు చేసి పంపిన సీడబ్ల్యూసీ
- మినట్స్‌లోని 8 (1), (2) పేరాలు మినహా మిగిలిన అంశాలను అంగీకరించమన్న తెలంగాణ
- అవాస్తవాలను సరిచేయాలని సీడబ్ల్యూసీని కోరిన రాష్ట్రం
- టెలిమెట్రీ కేంద్రాలపై కృష్ణాబోర్డు తీరును సైతం తప్పుబట్టిన రాష్ట్రం
- తెలంగాణ లేఖపై ఏపీ అభిప్రాయం కోరిన సీడబ్ల్యూసీ



హైదరాబాద్: ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య జల వివాదాల పరిష్కారానికి కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ అధ్యక్షతన ఇరు రాష్ట్రాల అధికారులతో కేంద్రం ఏర్పాటు చేసిన కమిటీ గత జనవరి 30న ఢిల్లీలో తొలిసారిగా సమావేశమై చర్చించిన అంశాలతో సీడబ్ల్యూసీ రూపొందించిన మినట్స్‌లో అవాస్తవాలు, సత్యదూరమైన అంశాలున్నాయని తెలంగాణ ఆగ్రహం వ్యక్తం

### ఖరీఫ్ సీజన్‌లో న్యూట్రియెంట్ బేస్డ్ సబ్సిడీగా రూ.41,534 కోట్లు.. కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం

కేంద్ర క్యాబినెట్ సమావేశంలో 5 కీలక నిర్ణయాలు

జైపూర్ మెట్రో ఫేజ్-2కు కేంద్ర క్యాబినెట్ తాజాగా ఆమోదం



### తెలుగు రాష్ట్రాలకు భారీ వర్ష సూచన..




హైదరాబాద్/అమరావతి,: తెలుగు రాష్ట్రాల్లోని వాతావరణ పరిస్థితులపై కీలక అప్‌డేట్ వచ్చింది. రెండు రాష్ట్రాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములు, మెరుపులతోపాటు ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఛత్తీస్‌గఢ్‌లో ఉన్న ఉపరితల ఆవర్తనం నుంచి తెలంగాణ, రాయలసీమతోపాటు తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు

### నాదర్‌గూల్ భూముల వ్యవహారంపై హరీశ్ రావుకు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కౌంటర్



హరీశ్ రావు చెబుతోన్న భూముల్లో 2022లోనే నిర్మాణాలు ప్రారంభమయ్యాయి

నాటి కేసీఆర్ ప్రభుత్వం కనీసం కౌంటర్ దాఖలు చేయలేదని ఆరోపించారు

## రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఢిల్లీకి ఘోరమైన గులాంగిరి చేస్తోంది: కవిత

- ★ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఢిల్లీకి ఘోరమైన గులాంగిరి చేస్తోంది: కవిత
- ★ కొత్త నెత్తురు, కొత్త రాజకీయాలను ఈ గడ్డకు పరిచయం చేస్తా
- ★ రాష్ట్రంలో అధికార పక్షం కాంగ్రెస్, ప్రతిపక్షం బీఆర్ఎస్ ప్రజల సమస్యలను ఎందుకు పట్టించుకోవటం లేదు



హైదరాబాద్, : దేశంలో ఎక్కడ ఎన్నికలు వచ్చిన సరే కాంగ్రెస్‌కు తెలంగాణ ఏటీఎంగా మారిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఢిల్లీకి ఘోరమైన గులాంగిరి చేస్తోందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఫోన్ చేస్తే ఫోన్‌లో మాట్లాడేటప్పుడు కూడా రేవంత్‌రెడ్డి నిలబడే మాట్లాడుతున్నారని.. లేదంటే తన కుర్చీకి ఎక్కడ ఎసరు వస్తుందోనని భయపడుతున్నారని సెటైర్లు గుప్పించారు. తెలంగాణ జాగృతిలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గొంగళ్ల రంజిత్ కుమార్, ఆయన అనుచరులు చేరారు. కండువా కప్పి జాగృతిలోకి కవిత ఆహ్వానించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు. రాసి పెట్టుకోండి.. తెలంగాణ భవిష్యత్, చరిత్రను మార్చే రోజు ఏప్రిల్ 25 అవుతోందని కవిత ఉద్ఘాటించారు. కొత్త నెత్తురు, కొత్త రాజకీయాలను ఈ గడ్డకు పరిచయం చేస్తానని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నిస్తాం, పోరాడుతాం, పరిష్కరిస్తామని చెప్పుకొచ్చారు. పప్పన్నం తింటాం, ప్రజల మధ్యలో ఉంటామని.. వారితోనే కలిసి పనిచేస్తామని మాటిచ్చారు. సామాన్యులతో, సామాన్యుల కోసం, సామాన్యులే ఉండేలా రాజకీయం తెస్తామని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో అధికార పక్షం కాంగ్రెస్, ప్రతిపక్షం బీఆర్ఎస్ ప్రజల సమస్యలను ఎందుకు పట్టించుకోవటం లేదని ప్రశ్నించారు. ప్రజల సమస్యల గురించి ప్రశ్నించేదెవరు అంటే ప్రతినోట జాగృతియే అనే మాట వస్తోందని చెప్పారు. ప్రజల సమస్యల గురించి కాంగ్రెస్ హై కమాండ్‌ని పైసలు అడిగితే నో రాహుల్ జీ అని రేవంత్‌రెడ్డికి సమాధానం చెబుతున్నారని అన్నారు. కానీ కేరళ ఎన్నికల కోసం ఎంత ఖర్చయినా పెడుతున్నారని విమర్శించారు. అప్పర్ తుంగభద్రకు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ఇస్తే రేవంత్‌రెడ్డి ఎందుకు సైలెంట్‌గా ఉన్నారని ప్రశ్నించారు. జాతీయ హోదా కారణంగా తుంగభద్రకు నీళ్లు రాక నష్టపోయేది ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాయేనని.. కానీ ఈ విషయంలో రేవంత్‌రెడ్డి ఎందుకు మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం లేదని నిలదీశారు. అటు కాంగ్రెస్‌ను, ఇటు బీజేపీని మెయింటెయిన్ చేస్తూ ప్రజలను మాత్రం మోసం చేస్తున్నారని ఆగ్రహించారు. తెలంగాణ జాగృతి తరఫున వచ్చే పార్టీ.. ప్రజల సమస్యలపై పోరాటం చేస్తుందని భరోసా కల్పించారు. అంతర్జాతీయ స్థాయిలో నిపుణులతో సమావేశమై ప్రజల కోసం అద్భుతమైన అజెండా రూపొందిస్తున్నానని చెప్పుకొచ్చారు. కొత్త తరహా రాజకీయాలు, ప్రజల కోసం మంచి చేసే రాజకీయాలు ఎలా ఉంటాయో చూపిస్తామని కవిత పేర్కొన్నారు.

# రోడ్ల నిర్మాణంతోనే జాతి నిర్మాణం, ఆర్థిక ప్రగతి



- జాతీయ, రాష్ట్ర రహదారుల నిర్మాణం జరగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం

అమరావతి: రాష్ట్రంలో కేవలం ప్రయాణ సౌకర్యాల కోసమే కాకుండా, విస్తృతమైన ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిచ్చేలా జాతీయ, రాష్ట్ర రహదారుల నిర్మాణం జరగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని పోర్టులను దేశంలోని ఇతర ప్రాంతాలతో అనుసంధానించేలా పటిష్ఠమైన కనెక్టివిటీ వ్యవస్థను నిర్మించాలని దిశానిర్దేశం చేశారు. సచివాలయంలో రహదారులు-భవనాలు, రవాణా, జాతీయ రహదారి ప్రాజెక్టులపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రహదారుల నిర్వహణ, గుంతలు లేని రోడ్లు, ఈవీ బస్సుల వినియోగం, పోర్టు కారిడార్ల అభివృద్ధి వంటి కీలక అంశాలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

వివిధ నగరాలకు ఔటర్ కారిడార్లు

రాష్ట్రంలోని ప్రధాన నగరాలైన రాజమండ్రి, కాకినాడ, తిరుపతి, కర్నూలు, నెల్లూరు వంటి ప్రాంతాల్లో ఔటర్ కారిడార్ మోడల్స్‌ను అధ్యయనం చేయాలని సీఎం ఆదేశించారు. నగరాలకు రింగ్ రోడ్లు నిర్మించడం వల్ల ఆయా ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు విస్తృతం అవుతాయని, ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని అభిప్రాయపడ్డారు. పొరుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రధాన నగరాలను ఏపీతో అనుసంధానించేలా రహదారుల నిర్మాణం జరగాలని స్పష్టం చేశారు.

### మావిగన్ పంచ్‌తో రాధాకృష్ణకు భయం పట్టుకుంది



అమరావతి పేరుతో దోపిడి ఆపాలి
వైఎస్ జగన్ నుంచి మావిగన్ ప్రతిపాదన రాగానే మీకు భయం పట్టుకుందా?'

కృష్ణా: ఏబీఎన్ రాధాకృష్ణ అభ్యంతరకర వ్యాఖ్యలపై ఏపీవ్యాప్తంగాఆందోళనకార్యక్రమాలు కొనసాగుతున్నాయి. పోలీసు యంత్రాంగం అడ్డుకునే ప్రయత్నాలు కొనసాగుతున్నప్పటికీ.. వైఎస్సార్‌సీపీ శ్రేణులు మాత్రం నిరసనలు కొనసాగిస్తున్నాయి. ఈ క్రమంలో బుధవారం ముస్తాబాద్‌లోని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయం వద్ద జరిగిన నిరసనల్లో మాజీ మంత్రి పేర్ని నాని పాల్గొని మాట్లాడారు. "రాధాకృష్ణ బరితెగించాడు. కాంట్రాక్టర్లకు బిల్లులు ఇప్పించి డబ్బులు దండుకుంటున్నాడు. నీది(రాధాకృష్ణను ఉద్దేశించి..) దమ్మున్న చానెల్ అయితే వాస్తవాలు ఒప్పుకో.

### స్టాలిన్‌కు అధికారం ఉంటే.. నా సభ జరిగేది కాదు



తిరునల్వేలి: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారం హోరెత్తుతోంది. తిరునల్వేలిలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో టీవీకే చీఫ్ విజయ్ పాల్గొన్నారు. అధికార డీఎంకేపై విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు 'పూర్తి అధికారాలు' ఉంటే తిరునల్వేలిలో ఈ సభ జరిగి ఉండేది కాదని అన్నారు. 'సీఎం ఏదో రకమైన అడ్డంకులు సృష్టించి మేము ఇక్కడకు రాకుండా నిరోధించే వారు. కానీ, ఇప్పుడున్నది ఆపద్ధర్మ ప్రభుత్వం.

### ఇరాన్ ఒప్పందం ఉల్లంఘిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి : జేడీ వాన్స్ హెచ్చరిక



న్యూఢిల్లీ: అమెరికా, ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతల తర్వాత కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం గంటల వ్యవధిలోనే ఒత్తిడికి గురవుతోందని అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇది చాలా 'బలహీనమైన ఒప్పందం' అని, టెహ్రాన్‌లోని అంతర్గత విభేదాల కారణంగా ఇది ఏ క్షణంలోనైనా విఫలం కావచ్చని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

## స్టాలిన్‌కు అధికారం ఉంటే.. నా సభ జరిగేది కాదు

మొదటి పేజి తరువాయి

కానీ, ఇప్పుడున్నది ఆపద్ధర్మ ప్రభుత్వం. ఆయన ఎలాంటి అధికారులు లేని సీఎం' అని విజయ్ అన్నారు. డీఎంకే కూటమిని 'క్యాష్-బాక్స్ అలయెన్స్'గా ఆయన అభివర్ణించారు. భాగస్వామ్య పార్టీల్లో ఐక్యత లేదని, కనీసం ఒకరికొకరు ఓటు కూడా వేసుకోరని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీపై కూడా ఆయన విమర్శలు ఎక్కుపెట్టారు. తమిళనాడు కాంగ్రెస్‌కు డీఎంకే కోట్లాది రూపాయలు ఇస్తోందని ఆరోపించారు. అయితే నిజమైన కాంగ్రెస్ మాత్రం టీవీకే వైపే ఉందని చెప్పారు. ఈ ఎన్నికల ప్రాధాన్యతను వివరిస్తూ, ఇతర పార్టీలకు ఇవి కేవలం ఎన్నికలే కావచ్చని, టీవీకేకు మాత్రం ఈ ఎన్నికలు ఒక ఎమోషన్ అని తెలిపారు. కాగా, తమిళనాడులో ప్రధాన పోటీ డీఎంకే సారథ్యంలోని సెక్యులర్ ప్రొగ్రసివ్ అలెయెన్స్‌కూ, అన్నాడీఎంకే సారథ్యంలోని ఎన్డీయే కూటమికి మధ్య ఉండగా, టీవీకేతో విజయ్ తొలిసారి ఎన్నికల్లో దిగడంతో త్రిముఖ పోటీ నెలకొంది. ఈనెల 23న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుంది. మే 4న ఫలితాలు వెలువడతాయి.

## ఇరాన్ ఒప్పందం ఉల్లంఘిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి : జేడీ వాన్స్ హెచ్చరిక

మొదటి పేజి తరువాయి

ఇది చాలా 'బలహీనమైన ఒప్పందం' అని, టెహ్రాన్‌లోని అంతర్గత విభేదాల కారణంగా ఇది ఏ క్షణంలోనైనా విఫలం కావచ్చని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవేళ ఇరాన్ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. బుడాపెస్ట్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ వాన్స్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. అధ్యక్షుడు ట్రంప్ తమను నిజాయతీగా చర్చలు జరపమని ఆదేశించారని, అయితే తమ సహనానికి కూడా ఒక హద్దు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. "వారు నిజాయతీగా చర్చలు జరిపితే, మేం కచ్చితంగా ఒక విస్తృత ఒప్పందాన్ని కుదుర్చుకోగలుగుతాం. కానీ, వారు అబద్ధాలు చెప్పినా, మోసం చేసినా.. దాని పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి" అని వాన్స్ హెచ్చరించారు. అవసరమైతే తమ వద్ద స్పష్టమైన సైనిక, దౌత్య, అసాధారణ ఆర్థిక పరపతి ఉందని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతానికి ఈ సంధి ఒక స్వల్పమైన దౌత్యపరమైన అవకాశాన్ని మాత్రమే కల్పించిందని, చర్చల్లో ఇరాన్ ఎలా వ్యవహరిస్తుందనే దానిపైనే తదుపరి దశ ఆధారపడి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కొన్ని గంటల క్రితమే కుదిరిన ఈ ఒప్పందం కేవలం ఘర్షణలకు తాత్కాలిక విరామం మాత్రమేనని, దీని భవిష్యత్తుపై అనిశ్చితి కొనసాగుతోందని ఆయన అన్నారు. "ఈ ఒప్పందం కుదిరి కేవలం 8 నుంచి 12 గంటలు మాత్రమే అయింది. అందుకే ఇది బలహీనమైన సంధి అని నేను చెబుతున్నాను" అని వాన్స్ వివరించారు. ప్రపంచ వాణిజ్యానికి ఆటంకం కలిగిస్తున్న కీలకమైన నౌకా మార్గాలను తిరిగి తెరవాలని, ఘర్షణ పూరిత చర్యలను నిలిపివేయాలని అమెరికా ఇచ్చిన అల్టిమేటం తర్వాతే ఈ ఒప్పందం కుదిరింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాల మేరకు చర్చలు జరిపినట్లు వాన్స్ తెలిపారు. "కీలక జలమార్గాలను తెరవండి, మేం కాల్పుల విరమణకు సిద్ధమవుతాం అని అధ్యక్షుడు స్పష్టంగా చెప్పారు" అని ఆయన పేర్కొన్నారు. ఈ ఒప్పందం ప్రకారం, వ్యూహాత్మక జలమార్గాల గుండా నౌకల రాకపోకలను పునరుద్ధరించడానికి ఇరాన్ అంగీకరించింది. దీనికి బదులుగా, అమెరికా, దాని మిత్రదేశాలు సైనిక దాడులను నిలిపివేశాయి. అయితే, కాల్పుల విరమణకు ముందే అమెరికా తన సైనిక లక్ష్యాన్ని సాధించిందని వాన్స్ స్పష్టం చేశారు. "ఇరాన్ సైనిక శక్తిని నిర్వీర్యం చేయడమే మా అధ్యక్షుడి లక్ష్యం. ఆ లక్ష్యం ఇప్పటికే నెరవేరింది" అని అన్నారు. ఒప్పందం కుదిరినప్పటికీ, ఇరాన్ నాయకత్వంలోని భిన్నాభిప్రాయాలు పరిస్థితిని క్లిష్టతరం చేస్తున్నాయని వాన్స్ ఆందోళన వ్యక్తం చేశారు. "ఇరాన్‌లో కొందరు ఈ ఒప్పందాన్ని సానుకూలంగా స్వాగతిస్తుంటే, మరికొందరు మాత్రం మేం సాధించిన దాని గురించి, ఒప్పందం స్వభావం గురించి పూర్తిగా అబద్ధాలు చెబుతున్నారు. కాల్పుల విరమణపైనా తప్పుడు ప్రచారం చేస్తున్నారు" అని ఆరోపించారు. ఈ అంతర్గత వైరుధ్యాలే సంధి బలహీనంగా ఉండటానికి ప్రధాన కారణమని, జాగ్రత్తగా వ్యవహరించకపోతే అది విఫలమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

## కాళేశ్వరం కమిషన్‌పై తెలంగాణ హైకోర్టు తీర్పు వాయిదా

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో విచారణ జరిపిన జస్టిస్ ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్‌లపై తుది తీర్పు వాయిదా పడింది. మెగా ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, నిర్వహణల్లో అవకతవకలపై విచారణ నిమిత్తం తెలంగాణ ప్రభుత్వం జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. దీన్ని సవాలు చేస్తూ బీఆర్ఎస్ అధినేత.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు, ఐఏఎస్ అధికారిణి స్మితా సభర్వాల్, ఐఏఎస్ మాజీ అధికారి ఎస్.కె.జోషిలు విడివిడిగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం సుదీర్ఘ విచారణ చేపట్టి మార్చి 12న తీర్పు వాయిదా వేసింది. ఇవాళ తుది తీర్పు వెల్లడించాల్సి ఉంది. అయితే.. ఇవాళ విచారణ జరగ్గా తీర్పును ఈ నెల 22వ తేదీకి వాయిదా వేసింది ధర్మాసనం. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో అవకతవకలు జరిగాయంటూ.. జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్‌ను నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం 2024 మార్చి 14న జీవో 6ను జారీ చేసింది. కమిషన్ చేపట్టిన విచారణ ప్రక్రియలో ఉల్లంఘనలు జరిగాయని, అభియోగాలు మోపే ముందు తమ వాదనను పరిగణనలోకి తీసుకోలేదని పిటిషనర్లు పేర్కొన్నారు. విస్తృత ప్రజాప్రయోజనాల దృష్ట్యా కమిషన్ వేశామంటూ మరొకరి పరువు ప్రతిష్ఠలు దెబ్బతీయడం సరికాదన్నారు. మరోవైపు ప్రభుత్వం తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ... ప్రజాప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని కమిషన్ వేసినట్లు తెలిపారు. జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక రికార్డుల ఆధారంగానే ఇచ్చిందన్నారు. ఇందులో భాగంగా పిటిషనర్లతోపాటు పలువురికి నోటీసులు ఇచ్చి విచారణ చేపట్టిందని.. కాబట్టి పిటిషన్‌లను కొట్టివేయాలని కోరారు.

## ఖరీఫ్ సీజన్‌లో న్యూట్రియెంట్ బేస్డ్ సబ్సిడీగా రూ.41,534 కోట్లు.. కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం



న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో 5 కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఖరీఫ్ సీజన్ కోసం న్యూట్రియెంట్ బేస్డ్ సబ్సిడీగా రూ.41,533.81 కోట్లు కేటాయించారు. ఇది 2025 ఖరీఫ్ సీజన్‌లో బడ్జెటరీ కేటాయింపుల కంటే రూ.4,313 కోట్ల రూపాయలు అధికం. 2025 ఖరీఫ్ బడ్జెట్ రూ.37,216.15 కోట్లుగా ఉంది. కాగా, జైపూర్ మెట్రో ఫేజ్-2కు కేంద్ర క్యాబినెట్ తాజాగా ఆమోదం తెలిపింది. రూ.13,038 కోట్లతో ఈ ప్రాజెక్టు చేపడతారు. ప్రహ్లాద్‌పుర నుంచి తోడి-మోడ్ వరకూ 36 స్టేషన్లను కలుపుతూ 41 కిలోమీటర్ల పొడవైన నార్త్-సౌత్ కారిడార్‌గా దీన్ని నిర్మించనున్నారు. కేంద్ర, రాజస్థాన్ ప్రభుత్వం జాయింట్ వెంచర్‌గా రాజస్థాన్ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ దీనిని చేపడుతుంది. రాజస్థాన్‌లో హెచ్‌పీసీఎల్ రిఫైనర్ కోసం రూ.79,459 కోట్లను కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. అరుణాచల్ ప్రదేశ్‌లోని కమ్లే, క్రా దాది-కురుంగ్ కుమే జిల్లాల్లో రూ.26,069.50 కోట్లతో 1720 మెగావాట్ల ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ నిర్మాణానికి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు 96 నెలల్లో పూర్తవుతుందని అంచనా వేశారు. కాగా, అరుణాచల్ ప్రదేశ్‌లోని అంజావ్ జిల్లాలో 1200 మెగావాట్ల కళాయి-2 హైడ్రో ప్రాజెక్టు నిర్మాణానికి రూ.14,105.83 కోట్లు కేటాయిస్తూ కేంద్ర మంత్రివర్గం మరో కీలక నిర్ణయం తీసుకుంది.

## నాదర్‌గూల్ భూముల వ్యవహారంపై హరీశ్ రావుకు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కౌంటర్



హైదరాబాద్ : నాదర్‌గుల్‌లో భూములను 2014లోనే నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం మూడు సంస్థలకు అప్పగించిందని, వారి హయాంలోనే ఆ సంస్థల పేరిట రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ కూడా జరిగిందని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. నాడు జరిగిన రిజిస్ట్రేషన్‌తో తమ ప్రభుత్వానికేం సంబంధమని మండిపడ్డారు. నాదర్‌గుల్ భూములను తమ ప్రభుత్వం హయాంలో కట్టబెట్టినట్లు ఆరోపణలు చేయడాన్ని ఆయన ఖండించారు. హరీశ్ రావు చెబుతోన్న భూముల్లో 2022లోనే నిర్మాణాలు ప్రారంభమయ్యాయని అన్నారు. ఆ సమయంలో బీఆర్ఎస్ అధికారంలో ఉందని గుర్తు చేశారు. తమకు నాలా కన్వర్షన్ ఇవ్వలేదని భూములు పొందినవారు 2022లో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తే, నాటి కేసీఆర్ ప్రభుత్వం కనీసం కౌంటర్ దాఖలు చేయలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం వచ్చాక ఆ భూములు ప్రభుత్వానివేనని కౌంటర్ దాఖలు చేశామని వెల్లడించారు. నాడు వాటాల కోసం భూములు కట్టబెట్టిన వారు ఇప్పుడు తమపై నిందలు మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్ రావు చెబుతున్న కంపెనీల్లో తన కుటుంబ సభ్యులు ఎవరూ లేరని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. నాదర్‌గుల్ భూముల వ్యవహారానికి సంబంధించిన కంపెనీల్లో తన కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే నిరూపించాలని సవాల్ చేశారు. కాగా, నాదర్‌గూల్ భూముల వ్యవహారంపై ఇటీవల రాజకీయ దుమారం చెలరేగుతోంది. రూ.7 వేల కోట్ల విలువైన 373 ఎకరాల ప్రభుత్వ భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేటు కంపెనీలకు కట్టబెట్టిందని హరీశ్ రావు ఆరోపిస్తున్నారు. అయితే ఈ భూమి యజమాని ఏక్యూ రియాల్టర్ అని చెబుతున్నారు. ఇది ప్రైవేటు భూమి అని హైకోర్టు, సుప్రీంకోర్టు గుర్తించాయని ఏక్యూ రియాల్టర్ అడ్వకేట్ ఇటీవల తెలిపారు.

# కేంద్ర జల సంఘానికి ఘాటుగా లేఖ రాసిన తెలంగాణ

మొదటి పేజి తరువాయి




సత్యదూరమైన అంశాలున్నాయని తెలంగాణ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ సమావేశంలో సీడబ్ల్యూసీ సభ్యకార్యదర్శి, కృష్ణాబోర్డు సభ్యులు ఇచ్చిన ప్రజెంటేషన్లలో వెల్లడించిన పలు అభిప్రాయాలు అవాస్తవమని..న్యాయస్థానాలు, ట్రిబ్యునళ్లు వాటిని పరిగణనలోకి తీసుకుంటే తమ రాష్ట్ర వాదనలకు తీవ్ర నష్టం కలిగిస్తాయని పెదవి విరిచింది. కేంద్రం/ ఏ రాష్ట్రం/ఇతర ఏ సంస్థ కూడా మినట్స్‌లో పేర్కొన్న అసంపూర్ణ చర్చలను ఏ న్యాయస్థానంలో చర్చ, ఉత్తర ప్రత్యుత్తరాల కోసం వాడకూడదని తేల్చి చెప్పింది. మినట్స్‌లోని పేరా 8 (1), (2)తో మినహా ఇతర అంశాలతో అంగీకరించడం లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ కార్యదర్శి ఇ.శ్రీధర్ తాజాగా సీడబ్ల్యూసీలోని ప్రాజెక్టు అప్రైజల్ అథారిటీ (పీఏఓ)కి లేఖ రాశారు. ఈ లేఖపై ఏపీ అభిప్రాయాన్ని సీడబ్ల్యూసీ కోరింది. తెలంగాణ లేఖలోని ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి..

గోదావరి జలాల కేటాయింపులు జరగలేదనడం తప్పు

గోదావరి జలాలను రాష్ట్రాలకు నిర్దిష్ట పరిమాణంలో కేటాయింపులు జరపలేదని మినట్స్‌లో సీడబ్ల్యూసీ పేర్కొనడం అసంపూర్ణ వ్యాఖ్య. ఇది తెలంగాణ వాదనలకు నష్టం కలిగిస్తుంది. రాష్ట్రాల మధ్య జరిగిన వివిధ అంతర్రాష్ట్ర ఒప్పందాల ఆధారంగా గోదావరి ట్రిబ్యునల్ పరీవాహక ప్రాంత రాష్ట్రాలకు నిర్దేశిత ప్రాంతాల వద్ద నీటి లభ్యత ఆధారంగా సరైన నాణ్యత, పరిమాణంతో కూడిన నిబంధనల రూపంలో కేటాయింపులు జరిపింది. గోదావరి ట్రిబ్యునల్ తీర్పునకు జత చేసిన అనుబంధం--బీలో వివిధ సబ్ బేసిన్లలోని నీటి వినియోగాన్ని స్పష్టీకరించింది. ' తెలంగాణలోని కాళేశ్వరం, సీతమ్మసాగర్, సీతారామ ఎత్తిపోతల వంటి ఎన్నో ప్రాజెక్టులతో పాటు ఇతర రాష్ట్రాల్లోని ప్రాజెక్టులకు..75 శాతం లభ్యత ఆధారంగా ట్రిబ్యునల్ నిర్దేశించిన నీటి పరిమాణాల ఆధారంగా సీడబ్ల్యూసీ అనుమతులిచ్చింది. మినట్స్‌లో నమోదు చేసిన అంశాల్లో వాస్తవికత లోపించిందని ఈ అంశాలు పేర్కొంటున్నాయి. వాటిని సరిచేయాలి.

కృష్ణా బోర్డు ప్రాథమిక బాధ్యతను మరిచింది...

మిగులు జలాలపై హక్కులను కోరకుండా వాటిని వాడుకునే స్వేచ్ఛను ఉమ్మడి ఏపీకి కృష్ణా ట్రిబ్యునల్--1 కేటాయించింది. దీని ఆధారంగా ఉమ్మడి ఏపీలో ఎన్నో ప్రాజెక్టులు చేపట్టారు. ప్రస్తుత ఏపీలో అలాంటి ప్రాజెక్టులు ఇప్పటికే పూర్తయ్యాయి. లేదా చివరి దశలో ఉన్నాయి. మరోవైపు ఉమ్మడి ఏపీ ప్రభుత్వం తెలంగాణలో చేపట్టిన పాలమూరు--రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకం వంటి బేసిన్ లోపలి ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉండిపోగా, వాటిని ప్రస్తుత ఏపీ అడ్డుకుంటోంది. కృష్ణా ట్రిబ్యునల్--1 ఉమ్మడి ఏపీకి కేటాయించిన 811 టీఎంసీల నుంచి ఎస్ఆర్‌బీసీ, భీమా తదితర ప్రాజెక్టులకు పునఃకేటాయింపులు చేస్తూ సీడబ్ల్యూసీ అనుమతులిచ్చింది. ఈ ప్రాతిపదికనే పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టును చేపట్టి అనుమతుల కోసం సీడబ్ల్యూసీకి డీపీఆర్ సమర్పించాం. ఈ పరిస్థితుల నేపథ్యంలో అనుమతులు లేని ప్రాజెక్టులకు అనుమతుల జారీకి విరుద్ధంగా కృష్ణా బోర్డు చేసిన వ్యాఖ్య ఏమాత్రం సరికాదు.

మినట్స్ నుంచి తొలగించాలి


టెలిమెట్రీ కేంద్రాల నిర్వహణను చేపట్టేందుకు నిరాకరిస్తూ కృష్ణాబోర్డు మినట్స్‌లో పేర్కొన్న కారణాలు ఏమాత్రం సరికాదు. కృష్ణా ట్రిబ్యునల్--1 తీర్పు, రాష్ట్ర పునర్విభజన చట్టం--2014తో పాటు అపెక్స్ కౌన్సిల్, కృష్ణా బోర్డుల నిర్ణయాలకు విరుద్ధమని కృష్ణాబోర్డు పేర్కొంది. నీటి వినియోగాన్ని నియంత్రించడమే ప్రాథమిక బాధ్యత కలిగిన చట్టబద్ధ సంస్థ అయిన కృష్ణాబోర్డు ఇలాంటివి చెప్పకూడదు.

తెలంగాణ వాదనలకు మినట్స్‌లో చోటు ఇవ్వలేదు

గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు తరలించి అక్కడి నుంచి పెన్నా బేసిన్‌కు తరలించుకోవడానికి ఏపీ చేసిన ప్రతిపాదనలు జాతీయ, అంతర్జాతీయ న్యాయసూత్రాలతో పాటు సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని సమావేశంలో తెలంగాణ నొక్కి చెప్పింది. ఏపీ ప్రతిపాదించిన పోలవరం--బనకచర్ల ప్రాజెక్టు తరహా వరద జలాల ఆధారిత ప్రాజెక్టులను మధించి అనుమతులు జారీ చేసేందుకు ఎలాంటి నిబంధనలు లేవని పేర్కొంది. ఈ విషయాన్ని మినట్స్‌లో సీడబ్ల్యూసీ నమోదు చేయలేదు.

# పరారీలో ఖేడా : హైదరాబాద్‌లో పవన్ ఇంటి వద్ద బారికేడ్లతో భద్రత

హైదరాబాద్ అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ భార్య రినికీ భూయాన్ శర్మపై ఆరోపణల కేసులో అస్సాం పోలీసులు ఆ రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేడా నివాసంలో సోదాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని బంజారా హిల్స్‌లో ఉన్న పవన్ ఖేరా, ఆయన భార్య నీలిమ ఇంటి బయట పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి, భారీ భద్రతను ఏర్పాటు చేశారు. తమను అస్సాం పోలీసులు ఇంకా సంప్రదించలేదని నగర పోలీసు వర్గాలు చెబుతున్నాయి. ఒకవేళ అస్సాం పోలీసులు వచ్చి నోటీసు ఇస్తే తాము సహకరిస్తామని వారు తెలిపారు. మరోవైపు పవన్ ఖేడా ఆచూకీ కోసం తాము ఇంకా ప్రయత్నిస్తున్నామని అస్సాం పోలీసులు బుధవారం తెలిపారు. ఢిల్లీలోని ఖేడా నివాసంలో నిజాముద్దీన్ ఈస్ట్‌లో ఉన్న కాంగ్రెస్ నాయకుడి ఇంటికి అస్సాం పోలీసుల బృందం దాదాపు రెండు గంటల పాటు సోదాలు జరిపిన అనంతరం, పోలీసులు "కొన్ని నేరారోపణ సాక్ష్యాలు" ఎలక్ట్రానిక్ పరికరాలతో వెనుదిరిగారు. హిమంత భార్యకు మూడు పాస్‌పోర్టులు ఉన్నాయని, విదేశాల్లో అక్రమంగా ఆస్తులు కూడబెట్టారని, ఆ సమాచారాన్ని ఎన్నికల అఫిడవిట్‌లో ప్రస్తావించలేదని ఖేడా తీవ్ర ఆరోపణలు గుప్పించిన సంగతి తెలిసిందే. దీనిపై సీఎం భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఖేడాపై గువాహటిలోని క్రైమ్ బ్రాంచ్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తులో భాగంగా అస్సాం పోలీసులు






మంగళవారం ఢిల్లీలో పవన్ ఖేడా నివాసానికి చేరుకొని సోదాలు చేశారు. అయితే, ఆ సమయంలో ఇంట్లో పవన్ ఖేడా లేరని, ప్రస్తుతం ఎక్కడున్నారో తెలియదని అస్సాం డీజీపీ దేబజిత్ నాథ్ చెప్పారు. ఎక్కడున్నా అరెస్టు చేస్తామని పేర్కొన్నారు. సోదాల్లో కొన్ని ఎలక్ట్రానిక్ పరికరాలు, ఖేడాపై నేరారోపణలకు దారితీసే కొన్ని పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆ వివరాలు ఇప్పుడే వెల్లడించలేమని పేర్కొన్నారు. అస్సాం పోలీసులు ఉదయం 11 గంటలకు పవన్ ఖేడా నివాసానికి చేరుకున్నారు. రెండు గంటల తర్వాత వెళ్లిపోయారు. ఈ సోదాల పట్ల కాంగ్రెస్ పార్టీ ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ నెల 9న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తప్పదని తేలిపోవడంతో హిమంత ఉక్కిరిబిక్కిరవుతున్నారని, అందుకే ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తున్నారని మండిపడింది. హిమంత భార్యపై ఖేడా చేసిన ఆరోపణలను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమర్థించారు. సీఎం భార్యపై ఈడీ లేదా సీబీఐతో దర్యాప్తు జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖేడాపై కేసును చట్టపరంగా ఎదుర్కొంటామని చెప్పారు. హిమంత, ఆయన కుటుంబ తప్పిదాలను బయటపెడతామన్నారు.

పరారైన ఖేడా: హిమంత

తనపై, తన కుటుంబంపై ఆరోపణలకు ఆధారమైన పత్రాలను కాంగ్రెస్ సరిచూసుకోలేదని హిమంత ఎద్దేవా చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలన్న ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే వ్యాఖ్యలను ఖండించారు. వృద్ధాప్యంతో ఆయన పిచ్?చగా మాట్లాడుతున్నారన్నారు. "మాపై ఆరోపణలు చేసిన పవన్ ఖేడా హైదరాబాద్ పారిపోయారు. ఆయన పాతాళంలో దాక్కున్నా పట్టుకోవడం తథ్యం" అని అన్నారు. నిజాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం, వాటిని కాంగ్రెస్ నాయకత్వం సమర్థించడం ఏమిటని సీఎం నిలదీశారు. "ఆరోపణల డాక్యుమెంట్లను ఖేడాకు రాహుల్ గాంధీ ఇచ్చి ఉంటారు. కనుక ఈ కేసులో రాహుల్ గాంధీని చేర్చాల్సి ఉంటుంది" అని పేర్కొన్నారు.

# నా పాదయాత్రలో బాబుకి రోజుకో సినిమా

మొదటి పేజి తరువాయి

మన ప్రభుత్వంలో తీసుకొచ్చిన పథకాలన్నీ చంద్రబాబు రద్దు చేశారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారు. రాష్ట్రంలో అన్ని రంగాల్లో తిరోగమనం కనిపిస్తోంది. మన పాలనలో రూ.3.31 లక్షల కోట్ల అప్పు చేస్తే.. అందులో డీబీటీ(సంక్షేమం పేరిట నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ) ద్వారా రూ.2.73 లక్షల కోట్లు ఇచ్చాం. కానీ చంద్రబాబు ఈ రెండేళ్లలోనే రూ.3.52 లక్షల కోట్లు చేశారు. చంద్రబాబు తెచ్చిన అప్పులన్నీ ఎవరి జేబుల్లోకి పోయాయి? అని వైఎస్ జగన్ నిలదీశారు.

మావిగన్‌పై మరోసారి వైఎస్ జగన్ కీలక వ్యాఖ్యలు

తాడేపల్లి: రాజధాని విషయంలో తాము ఆచరణాత్మక పరిష్కారం చూపామని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఉద్ఘాటించారు. బుధవారం తాడేపల్లిగూడెం



నియోజకవర్గ పార్టీ కేడర్ భేటీలో మావిగన్ ప్రతిపాదనపై మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారాయన. చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రానికి రాజధాని ఎప్పటికీ లేకుండా చేస్తోంది. అమరావతి పేరుతో రైతులను, ప్రజలను మోసం చేస్తోంది. కాంట్రాక్టులతో కమీషన్లు దండుకోవడానికే ఈ అమరావతి. అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే మేం రాజధాని వస్తుందని చెప్పాం. రాజధాని బెస్ట్ ఆప్షన్‌గా ప్లాన్ ఏ కింద.. విశాఖపట్నంను చెప్పాం. న్యాయ రాజధానిగా కర్నూల్‌ను చెప్పాం. అమరావతిని శాసన రాజధానిగా చెప్పాం. అదీ వద్దనుకుంటే ప్లాన్ బీగా మచిలీపట్నం, విజయవాడ, గుంటూరులతో కూడిన 110 కి.మీ కారిడార్‌ను మావిగన్ ను సూచించాం. అమరావతి పేరుతో రూ.2 లక్షల కోట్ల భారం వేసే బదులులో అందులో 10 శాతం పెట్టుబడి పెడితే మావిగన్‌లో అద్భుతాలు సౌకర్యాలు కల్పించొచ్చు. కానీ, చంద్రబాబు మావిగన్‌ను వద్దంటున్నారు. ఎందుకంటే చంద్రబాబు చెప్పే ఆ అమరావతి.. అతిపెద్ద దోపిడీ గని కాబట్టి. హైదరాబాద్, చెన్నై, బెంగళూరులో ఫైవ్‌స్టార్ చదరపు అడుగుకు రూ.4,500 మాత్రమే. కానీ, అమరావతిలో మాత్రం రూ.14,000 కట్టబెడుతున్నారు. దీనిని దోపిడీ కాక మరేమంటారు? అని వైఎస్ జగన్ అన్నారు.

# రోడ్ల నిర్మాణంతోనే జాతి నిర్మాణం, ఆర్థిక ప్రగతి

మొదటి పేజి తరువాయి

రహదారుల పటిష్ఠ నిర్వహణపై సీఎం దృష్టి

రాష్ట్రంలో రహదారుల నిర్వహణ అత్యంత పటిష్టంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 45,433 కిలోమీటర్ల రోడ్లలో, ఏటా 10,238 కిలోమీటర్ల మేర నిరంతర నిర్వహణ చేపట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. రోడ్లపై గుంతలు పడిన వెంటనే మరమ్మతులు చేపడితే సమస్యలు ఉండవని, ఇది నిరంతర ప్రక్రియగా సాగాలని సూచించారు. రోడ్ల నిర్వహణలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవలంబిస్తున్న ఉత్తమ పద్ధతులను అధ్యయనం చేయాలని ఆదేశించారు. ఆర్ అండ్ బీ రహదారుల నిర్వహణకు నిధుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉభయ గోదావరి జిల్లాలతో పాటు నల్లరేగడి నేలలున్న ప్రాంతాల్లో హైబ్రీడ్ మోడల్‌లో బీటీ లేదా వైట్ ట్యాప్ రోడ్లు నిర్మించాలని, కాలువ గట్ల వెంబడి తరచూ దెబ్బతింటున్న 570 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి కొత్త సాంకేతికతపై యూనివర్సిటీలతో అధ్యయనం చేయించాలని సూచించారు.

గోదావరి పుష్కరాలకు ప్రత్యేక కార్యాచరణ

రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ముఖ్యంగా గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని 471 గ్రామాల్లో రోడ్ల మరమ్మతులు వెంటనే చేపట్టాలన్నారు. గ్రేటర్ రాజమహేంద్రవరం పరిధిలో చేపట్టే రహదారుల అభివృద్ధి పనులు రాష్ట్రానికే రోల్ మోడల్‌గా నిలవాలని ఆకాంక్షించారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పుష్కరాల కోసం రూ.400 కోట్ల 'సాస్కీ' నిధులతో 531 కిలోమీటర్ల పొడవైన రహదారులను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. కుంభమేళా తరహాలో పుష్కరాలకు నిధులు కేటాయించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని అధికారులకు సూచించారు.

పోర్టుల అనుసంధానమే లక్ష్యం

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు పోర్టులు గుండెకాయ వంటివని, వాటిని కలుపుతూ జాతీయ రహదారుల నిర్మాణం జరగాలని చంద్రబాబు అన్నారు. పశ్చిమ భారతంలో గుజరాత్ మోడల్ తరహాలో, తూర్పు తీరంలో ఆంధ్రప్రదేశ్‌ను పోర్టుల హబ్‌గా తీర్చిదిద్దాలని చెప్పారు. ఈస్ట్-వెస్ట్ కారిడార్ల నిర్మాణంతో లాజిస్టిక్స్ వ్యయాన్ని గణనీయంగా తగ్గించడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. మూలపేట, విశాఖ, గంగవరం, కాకినాడ, మచిలీపట్నం, రామాయపట్నం, కృష్ణపట్నం పోర్టులను అనుసంధానిస్తూ, పొరుగు రాష్ట్రాల సరిహద్దుల వరకు ప్రత్యామ్నాయ మార్గాలను కూడా నిర్మించాలని చెప్పారు. దీనికి అవసరమైన ఆర్థిక వనరులను 'ఏపీ లింక్' ద్వారా సమకూర్చుకోవాలని సూచించారు.

ఆర్థిక ప్రగతికి జాతీయ రహదారుల కీలకం

"జాతీయ రహదారుల నిర్మాణంతోనే జాతి నిర్మాణం జరుగుతుంది" అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. రహదారుల నిర్మాణం ద్వారా సమీప ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు పెరగాలన్నారు. పారిశ్రామిక, ఉద్యాన ఉత్పత్తులకు కేంద్రంగా మారుతున్న ఏపీ నుంచి జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లకు సరుకు రవాణా సులభతరం కావాలని చెప్పారు. ఖరగ్ పూర్-అమరావతి గ్రీన్ ఫీల్డ్ హైవే, హైదరాబాద్-శ్రీశైలం-దోర్నాల, కల్వకుర్తి-నంద్యాల వంటి జాతీయ రహదారులతో కనెక్టివిటీ మరింత పెరుగుతుందని తెలిపారు. రాబోయే రెండేళ్లలో 1335 కిలోమీటర్ల జాతీయ రహదారులు అందుబాటులోకి వస్తాయని, ఈ ఏడాదిలోనే రూ.24,502 కోట్ల విలువైన ప్రాజెక్టులు పూర్తి కావాలని లక్ష్యంగా నిర్దేశించారు.

తక్కువ వ్యయంతో ఈవీ బస్సులు

ప్రజా రవాణాను అతి తక్కువ వ్యయంతో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, దీనికి ఎలక్ట్రిక్ బస్సుల వినియోగమే సరైన మార్గమని చంద్రబాబు అన్నారు. ప్రస్తుతం కిలోమీటరుకు రూ.72గా ఉన్న ఈవీ బస్సు నిర్వహణ వ్యయాన్ని తగ్గించేందుకు వివిధ మోడళ్లను అధ్యయనం చేయాలని సూచించారు. ఛార్జింగ్ స్టేషన్లు, బ్యాటరీ స్టాండర్డైజేషన్ వంటి అంశాలపై దృష్టి సారించాలన్నారు. అన్ని కేటగిరీల్లోనూ ఏసీ ఈవీ బస్సులనే నడపాలని, ప్రజల్లో ఈ-సైకిళ్ల వినియోగాన్ని ప్రోత్సహించి దానిని ఒక మాస్ ట్రాన్స్‌పోర్ట్‌గా మార్చాలని సీఎం స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఆర్టీసీ ఎండీ బాలసుబ్రహ్మణ్యం, జాతీయ రహదారుల సంస్థ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తెలుగు రాష్ట్రాలకు భారీ వర్ష సూచన..

రాయలసీమతోపాటు తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉత్తర, దక్షిణ ద్రోణి ఏర్పడిందని పేర్కొంది. దీని ప్రభావంతో ఏపీలో రాగల మూడు రోజుల వరకు వాతావరణ సూచనలు చేసింది. బుధవారం తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి రెండు ప్రాంతాల్లో కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈదురు గాలులు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్లు వేగంతో వీస్తాయని చెప్పింది. ఇక గురు, శుక్రవారాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి, రెండు చోట్ల కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈదురు గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని వివరించింది. బుధ, గురు వారాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందంది. ఉరుములతో కూడిన మెరుపులు సంభవించే అవకాశం ఉందని తెలిపింది. ఈదురు గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీస్తాయంది. శుక్రవారం తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందంది. బుధవారం తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈదురు గాలులు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని తెలిపింది. గురు, శుక్ర వారాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని చెప్పింది. ఈదురు గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని పేర్కొంది. ఛత్తీస్‌గఢ్ పరిసర ప్రాంతాల్లో ఉపరితల చక్రవాత ఆవర్తనం సముద్ర మట్టం నుంచి 0.9 కిలోమీటర్ల ఎత్తులో బుధవారం ఏర్పడిందని హైదరాబాద్‌లోని వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఈ రోజు (బుధవారం) తెలంగాణలో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు ఒకటి రెండు జిల్లాల్లో కురిసే అవకాశం ఉంది. రానున్న మూడు రోజులు రెండు నుంచి మూడు డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. ఈ రోజు రాష్ట్రంలోని ఒకటి.. రెండు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని తెలిపింది.

## మావిగన్ పంచ్‌తో రాధాకృష్ణకు భయం పట్టుకుంది

నీది(రాధాకృష్ణను ఉద్దేశించి..) దమ్మున్న చానెల్ అయితే వాస్తవాలు ఒప్పుకో. చంద్రబాబుకు వంత పాడడమే నీకు తెలుసు. అమరావతిలో నీ బ్యాచ్ ఎంత డబ్బు పెట్టారు?. వైఎస్ జగన్ నుంచి మావిగన్ ప్రతిపాదన రాగానే మీకు భయం పట్టుకుందా?" అని అన్నారు. రాష్ట్ర ప్రజలు అప్పుల పాలు అవ్వకూడదు. అమరావతి పేరుతో దోపిడి ఆపాలి. వందేళ్లైనా అమరావతి పూర్తి కాదు. ఆ అవినీతిని అడ్డుకోవాలని జగన్ కోరారు. అందుకే మావిగన్ పెట్టమని జగన్ చెప్పారు. జగన్ చెప్పింది తప్పు అయితే అది తప్పని నిరూపించు. అంతేగానీ ఏబీఎన్‌ను అడ్డం పెట్టుకొని రోత రాతలు రాస్తున్నారు. అసలు ఏబీఎన్ రాధా కృష్ణది కానే కాదు. ఎవరో యావడో పెట్టిన ఛానల్ దోచుకొన్నాడు కదా. రాధాకృష్ణా.. కాశీ వెళ్లి సిగ్గుశరం వదిలేసి వచ్చావా?. దమ్మున్న చానల్ అయితే.. వలంటీర్ల విషయంలో కూటమి పార్టీల నేతలను ఎందుకు నిలదీయలేదు?. ఈ రెండేళ్లలో చంద్రబాబు 4లక్షల కోట్లు అప్పు చేస్తే ఏమైపోయావ్?. నీతులు చెప్పగానే సరిపోదు.. అమలు చేయాలి. ఆడవాళ్లను కించపరిచేలా మాట్లాడినందుకు తక్షణమే క్షమాణలు చెప్పాలి అని పేర్ని నాని డిమాండ్ చేశారు. ఈ నిరసనల్లో పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

# ఒంగోలులో అవధాన "సురభి"ళం

-ధారా,ధారణ,ధైర్యంతోసాగే సాహితీప్రక్రియ అష్టావధానం.



ఒంగోలు, ఏప్రిల్ 8 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) షిరిడీసాయి కల్చరల్మిషన్ లాయర్ పేట ఒంగోలువారి నిర్వహణలో జరిగిన అష్టావధానం సాహితీ పిపాసులను ఆద్యంతం అలరింపచేసింది.జాతీయ సాహిత్య పురస్కారగ్రహీత అవధానధుని సురభి శంకరశర్మ చేసిన ఈఅవధాన సభకు, డాక్టర్ రావిపాటి ప్రసాదరావు అధ్యక్షులుగా , ఏపిజాయింట్ ట్రాన్స్ పోర్ట్ కమీషనర్ సాహితీవేత్త డాక్టర్ శ్రీకృష్ణవేణి అతిథులుగా పాల్గొన్నారు. దత్తపది ప్రాశ్నికులు -పంది, పంది ,పంది, పంది, పదాలను వేరే అర్థాలలో ఉపయోగస్తూ పెళ్లి సన్నివేశం పై ఉత్పలమాలలోపద్యం కోరారు."పంది"రి శోభలోవెలుగ, బాగుగ దీర్చగ పెండ్లికూతు కొ"ప్పంది"యు వేసెపూలజడ నంగనలెంతయొ ప్రేమజూపి మె "ప్పంది"యు వచ్చెనావరుడు నామెకు తాళిని గట్ట మోదనా "స్పంది"త చేతనుండగుచు భద్రములయ్యెను పెండ్లివేడుకల్ అని సురభి పూరించారు.సమస్యప్రాశ్నికులు, పగకల్గన్ సమకూరు సౌఖ్యములు సుస్పష్టంబులీవాక్కులౌ. అని ఇవ్వగా, మగవారైనను స్త్రీజనంబయిన కామక్రోధమోహాదులన్ జగమెందెన్నడు లొంగిపోక మది విశ్వాసమ్ము పెంపొందగా, వగపున్ జెందక శాంతబుద్ధి నరిషడ్వర్గంబు ఛేదించి , ''చంపగ"గల్గన్ సమకూరు సౌఖ్యములు సుస్పష్టంబులీవాక్కులౌ.అని అవధాని సురభి పూరణచేశారు. న్యస్తాక్షరి ప్రాశ్నికులు యుద్ధ నివారణకు శాంతికాముకభారతదేశం సందేశం కావాలని, మత్తకోకిల వృత్తంలో పద్యాన్ని కోరారు. ఒకటవ పాదంలో మూడవ అక్షరం "సా", 2వపాదంలో1వ అక్షరం " యి", 3వపాదంలో 11వ అక్షరం"బా",నాల్గవ వపాదంలో ఆరవ వ అక్షరం "బా" సాయిబాబా వచ్చేటట్లు పద్యమడిగారు.శాంతి"సా"ధనజేయగవలె సర్వ మానవ రక్షకై, "యిం"తలింతలు స్వార్థబుద్ధులు హెచ్చుచుండెను జూడగా, ధ్వాంతమందునముంచివేయును "బాం"బు సంస్కృతి విశ్వమున్ భ్రాంతచిత్తుల"బా"గుజేయగ భారతమ్మొక మార్గమౌ. అని సురభి పూరించారు. వర్ణన ప్రాశ్నికులు, ఒంగోలు విశిష్టతను శార్దూల పద్యంలో వర్ణించమని అడుగగా.. సింగంబౌచును దూకునుద్యమములన్, శ్రేయమ్ము కాంక్షించుచున్ బంగారంబుగ వెల్గుచుండు కళలన్, ప్రత్యేకతన్ జాటుచున్ పొంగారున్ గద నవ్యభావములకన్ ప్రోత్సాహమై యిద్దియున్, ఒంగోల్ గిత్తలు విశ్వకీర్తిగనియెన్, ఓహోహో ఒంగోలనన్. అని సమస్యను పూరించారు అవధానిసు రభి.అష్టావధాని మానేపల్లి నాగకుమార్ సభాసంచాలకులు గావ్యవహరించారు. నిషిద్ధాక్షరికి- అష్టావధానిదూపాటి రామాచార్యులు,న్య స్తాక్షరికి- అష్టావధాని డాక్టర్ జిల్లెళ్ళవరప్రసాద్, దత్తపదికి-డా.రామచంచంద్రుని రమేష్, సమస్యకు-గుడ్లూరి వేంకటేశ్వరరాయకవి, వర్ణనకు- తెలుగు ఉపన్యాసకులు యడ్లపల్లి శ్రీరామమూర్తి,ఆశువు కు-తెలుగు అధ్యాపకులు యం.వి.యస్. శాస్త్రి, మీమాట-నాపాటకు విశ్వకళాభారతి అధ్యక్షులు నాదెండ్ల జ్వాలా ఉమామహేశ్వరశర్మ, అప్రస్తుతప్రసంగం-సంస్కృతోపన్యాసకులు దొప్పలపూడి వేంకటరావులు ప్రాశ్నికులుగా పాల్గొన్నారు. అవధాన అనంతరం ,రావిపాటి, సాయికల్చరల్మిషన్ సభ్యులు అవధానిసరభి ని,ప్రాశ్నికులను ఘనంగా సత్కరించారు.

## మహిళలపై అసభ్య పదజాలం రాధకృష్ణకు తగదు

వైయస్సార్ సి పి రాష్ట్ర నాయకుడు కండెల్ల పెద్దిరాజు




కాకినాడ జిల్లా, జగ్గంపేట ఏప్రిల్ 08 నేటి శుభోదయ :గోకవరం మండలంలో స్థానిక గుమ్మల్లదొడ్డి గ్రామంలో జరిగిన పత్రికా సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మాదిగ వెల్ఫేర్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మరియు వైయస్సార్ సి పి పెన్షనర్స్ & రిటైర్డ్ ఉద్యోగుల రాష్ట్ర కార్యదర్శి కండెల్ల పెద్దిరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి పాలన వలన రాష్ట్రంలో ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని, మహిళలని కూడా చూడకుండా దాడులు జరుగుతున్నాయని ఆయన వాపోయారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి గారి యొక్క అభిప్రాయాలను వక్రీకరిస్తూ వై సి పి కార్యకర్తలను, మహిళలనుద్దేంచి ఆంధ్రజ్యోతి & ఏబీఎన్ చీఫ్ రాధకృష్ణ చేసిన వాక్యలు వ్యంగ్యమైన ధోరణిలో ఉన్నాయని, మహిళామణులను ఆటబొమ్మాల్లా చిత్రికరిస్తూ చేసిన వాక్యలు చాలా దిగుత్సాకరమైన మాటలని సభ్య సమాజం తలదించికునేలా ఉన్నాయని ఆయన విచారం వ్యక్తం చేసారు. వైయస్సార్ సి పి అధినేత జగన్ మోహన్ రెడ్డి ఏదంటే అదే నమ్ముతారన్నట్టు, వారి వారి భార్యలను వారి భర్తలతో వారు మీ భార్యలు కారు, మీకు చెల్లెల్లు అవుతారు అని అంటే వారు అదేవిధంగా అనుచరిస్తారని ఏబీఎన్ రాధకృష్ణ అనడంలో వారి యొక్క అంతర్యమేమిటో చెప్పాలని, అంటే వారి వారి భర్తలు వారి భార్యలను వేరే వాళ్లకు వివాహాలు చేయడానికి కూడా వెనకడుగు వెయ్యరనే ఆలోచనా ధోరణిగా ఉందని ఇది సరైనది కాదని, మహిళలను దేవతల్లా పూజించే ఈ దేశంలో మహిళలను అసభ్యంగా మాట్లాడటం సరైన పద్ధతి కాదని మహిళలను కించపరచడమేనని మరియు మహిళలపై వివక్షతని, మాటలు వెనక్కు తీసుకుని మహిళలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఆయన హెచ్చరించారు. సభ్య సమాజంలో ప్రతీ ఒక్కరికీ పత్రికా,మాట్లాడే స్వేచ్ఛా హక్కులు రాజ్యాంగం కల్పించిందని, అలాగని హక్కులకు భంగం కలిగే విధంగా ప్రవర్తిస్తే ఎవ్వరూ చూస్తూ ఊరుకోరని, నోరు ఉందికదా అని ఇష్టారాజ్యంగా నోరు అదుపు తప్పితే తగు మూల్యం చెలించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు.

## కార్పొరేషన్ అధికారులకు హెడ్ వాటర్ వర్క్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహణ



విజయవాడ, ఏప్రిల్ 8 (నేటి శుభోదయ):- నగర ప్రజలకు సరఫరా అయ్యే త్రాగునీరు, హెడ్ వాటర్ వర్క్స్ లో ఎలా శుద్ధి జరుగుతుంది వంటి అంశం ప్రతి ఒక్కరికి తెలియాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ఉదయం కార్పొరేషన్ అధికారులకు కుమ్మరిపాలెం, విద్యధరపురంలో డాక్టర్ కె ఎల్ రావు హెడ్ వాటర్ వర్క్స్ లో ఇంజనీరింగ్ సిబ్బందిచే అవగాహన కల్పించారు. అదనపు కమిషనర్ (జనరల్) ఏ. రవీంద్రరావు ఆధ్వర్యంలో వివిధ శాఖధిపతులకు చీఫ్ ఇంజనీర్ (ఇన్చార్జి) పి. సత్య కుమారి కృష్ణానది నుండి నీరును ఎలా తీసుకుని వివిధ పద్ధతులతో నీటి శుద్ధత చేసే ప్రక్రియను చూపించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్లు కె. షమ్మీ, కె. ప్రభుదాస్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ కె. అర్జున రావు, డెప్యూటీ కమిషనర్ (రెవిన్యూ) జి. సృజన, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడి) యం. విజయ లక్ష్మి, ఎస్టేట్ ఆఫీసర్ ఎ. శ్రీధర్, డెప్యూటీ సిటీ ప్లానర్ చంద్ర బోస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ పి. మోహన్ బాబు,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు అన్నపూర్ణ, గోపాల నాయక్, అసిస్టెంట్ కమిషనర్లు ఏ యూ బి శర్మ, హెలెన్, డి యస్ యస్ శ్రీనివాస్, సి డి ఓ లు శ్రీకాంత్, జగదేశ్వరి, ఉమా మహేశ్వరీ, సిబ్బంది పాల్గొన్నారు.

## నగర అందాన్ని పెంచాలి, హరితాన్ని పెంపొందించాలి: విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ, ఏప్రిల్ 8 (నేటి శుభోదయ):- నగరం అందాన్ని పెంచేలా, హరితాన్ని పెంపొందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. బుధవారం ఉదయం తన పర్యటనలో భాగంగా కృష్ణవేణి ఘాట్, భవానిపురం ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర అందాన్ని పెంచేలా వినూత అంశాలతో నూతన వాల్ పెయింటింగ్లు, పెరుగుతున్న ఉష్ణోగ్రతను తగ్గించేందుకు వాతావరణంలో ఉన్న కాలుష్యాన్ని నివారించేందుకు హరితాన్ని పెంచే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కమిషనర్ అన్నారు. మొక్కలని నాటడమే కాకుండా వాటిని సంరక్షించేందుకు ప్రతిరోజు మొక్కలకు నీరు పోస్తుండాలని ఇప్పటివరకు నాటిన మొక్కలను సురక్షితంగా చూసుకోవాలని అన్నారు. ఘాట్లలో పారిశుధ్య నిర్వాహణ కొరకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె. శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

# స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విజయవాడకు అగ్రస్థానం లక్ష్యం

వినూత్న కార్యాచరణతో విస్తృత ప్రజా భాగస్వామ్యంతో అది సాధ్యమే కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ, ఏప్రిల్ 8 (నేటి శుభోదయ):- స్వచ్ఛసర్వేక్షణ్‌లో గతేడాది మెరుగైన ర్యాంకులు సొంతం చేసుకున్నామని. ఈసారి మరింత మెరుగ్గా అగ్రస్థానం లక్ష్యంగా అడుగేసి సత్తా చాటుదామని, వినూత్న కార్యాచరణతో, విస్తృత ప్రజా భాగస్వామ్యంతో ఇది సాధ్యమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. జిల్లా కలెక్టర్, విజయవాడ నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి డా. జి.లక్ష్మీశ అధ్యక్షతన మునిసిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరంలో బుధవారం 30కు పైగా రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు (ఆర్‌డబ్ల్యూఏ), టెర్రస్ గార్డెన్ అసోసియేషన్ల ప్రతినిధులతో సమావేశం జరిగింది. నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎంతో కలిసి స్వచ్ఛతలో నగర కీర్తిప్రతిష్టలను పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రణాళికల అమల్లో ఆర్‌డబ్ల్యూఏల భాగస్వామ్యంపై సమావేశంలో చర్చించారు. అసోసియేషన్ల ప్రతినిధుల సలహాలు సూచనలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ మెరుగైన ర్యాంకును కైవసం చేసుకోవడం కంటే ఆ ర్యాంకును సుస్థిరం చేసుకుంటూ ముందుకెళ్లడం కష్టమని.. చేయీచేయీ కలిపితే లక్ష్యాల సాధన అసాధ్యమేమీ కాదని పేర్కొన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విజయవాడను దేశంలో అగ్రగామిగా నిలిపేందుకు ప్రతిఒక్కరూ బాధ్యతతో



ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రమైన నగరం అనేది ప్రభుత్వ బాధ్యతతో పాటు ప్రతి పౌరుడి కర్తవ్యమని స్పష్టం చేశారు. ఇంటి స్థాయిలోనే తడి, పొడి చెత్తను వేరు చేయడం ద్వారా శుభ్రతకు పునాది వేయవచ్చన్నారు. ప్రజలు స్వచ్ఛతపై చైతన్యంతో వ్యవహరించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రభుత్వ స్వచ్ఛతా కార్యక్రమాల అమల్లో భాగస్వాములు కావాలన్నారు. అదేవిధంగా నగరంలో హరిత విస్తీర్ణాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి కాలనీలో పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు టెర్రాస్ గార్డెనింగ్‌ను ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్యకర జీవనశైలిని సొంతం చేసుకోవచ్చన్నారు.పార్కులు పట్టణ ప్రజల శారీరక, మానసిక ఆరోగ్యానికి ముఖ్య ఆధారాలని పేర్కొన్న కలెక్టర్ లక్ష్మీశ వాటి అభివృద్ధి, నిర్వహణలో భాగస్వాములు కావాలని కోరారు. కాలనీల్లో ఉన్న పార్కులను శుభ్రంగా, ఆకర్షణీయంగా ఉంచేందుకు, అభివృద్ధికి ఆర్‌డబ్ల్యుఏలు చొరవ చూపాలని, నవ్య రాజధాని అమరావతికి గేట్ వే అయిన విజయవాడ సమగ్రాభివృద్ధిలో కీలక భాగస్వాములు కావాలని కోరారు. కమిషనర్ ధ్యానచంద్ర స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రజల భాగస్వామ్యంతో ఇప్పటికే మంచి ర్యాంకులు సాధించామని. 2025-26కు సంబంధించి కూడా ముందంజలో నిలిచేందుకు కృషిచేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. ఇందుకు వార్డు స్థాయిలోనూ జన జాగృతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజయవాడను గ్లోబల్ సిటీగా, హ్యాపీ సిటిగా తీర్చిదిద్దేందుకు సమష్టి కృషి అవసరమని.ఇందులో భాగంగా భాగస్వామ్య పక్షాలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ధ్యానచంద్ర వెల్లడించారు. సమావేశంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డా. డి.చంద్రశేఖర్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డా. కె.అర్జునరావు, చీఫ్ ఇంజనీర్ పి.సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ ) జి.సృజన, డిప్యూటీ డైరెక్టర్ (ఉద్యాన) చంద్రశేఖర్, రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్, టెర్రస్ గార్డెన్ అసోసియేషన్స్, ప్రజారోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం అభివృద్ధికి రూ.170 కోట్లతో భారీ ప్రణాళిక

ఖేలో ఇండియా నిధులతో స్టేడియం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



విజయవాడ, ఏప్రిల్ 8 (నేటి శుభోదయ):- రాబోయే మూడు సంవత్సరాలలో ప్రతి నగరం, పట్టణం, గ్రామాల్లో క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ క్రీడారంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలిపేలా కృషి చేస్తున్నామని రాష్ట్ర రవాణా, క్రీడలు శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. ఖేలో ఇండియా నిధులు రూ.19 కోట్ల వ్యయంతో విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ కార్పొరేషన్ (ఐజీఎంసీ) స్టేడియం లో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, క్రీడలు శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా, నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, శాప్ ఎండీ భరణి తదితరులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఉభయసభల్లో అమరావతికి చట్టబద్ధత కల్పించిన శుభ సందర్భంలో ఈ కార్యక్రమం జరగడం విశేషమన్నారు. విజయవాడ నగరానికి ఎంతో భావోద్వేగ అనుబంధం కలిగిన ఐ జి ఎం సి స్టేడియం అభివృద్ధిని గత ప్రభుత్వం ఐదేళ్లపాటు నిర్లక్ష్యం చేసిందన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత క్రీడలకు మరలా ప్రాధాన్యత పెరిగిందని, క్రీడాకారులకు గుర్తింపు లభిస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా క్రీడా వసతుల కల్పన దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అదే రీతిలో విజయవాడలోని ఐజీఎంసీ స్టేడియం అభివృద్ధికి మొత్తం సుమారు రూ. 160 నుండి రూ. 170 కోట్ల వరకు మూడు దశల్లో వ్యయం చేయనున్నట్లు తెలిపారు. ఇందులో ఖేలో ఇండియా ద్వారా రూ.20 కోట్లు, శాప్ ద్వారా రూ. 20 కోట్లు, మిగిలిన నిధులు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సమకూరనున్నాయని వెల్లడించారు. గత ప్రభుత్వ ఐదేళ్లలో ఆగిపోయిన క్రీడా అభివృద్ధి కార్యక్రమాలు ఇప్పుడు వేగం పుంజుకున్నాయని, గుంటూరులో ఇప్పటికే శంకుస్థాపన జరిగిందని, త్వరలో శ్రీకాకుళంలో కూడా పనులు ప్రారంభమవుతాయని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రానికి కేంద్రం నుండి రూ.1000 కోట్ల నిధుల ప్రతిపాదనలు ఉన్నాయని, రెండో విడతలో రూ.100 కోట్లకు పైగా నిధులు వచ్చే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రంలో క్రీడారంగం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని మంత్రి కొనియాడారు.ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఉన్న విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ నేతృత్వంలో శాప్, నగర పాలక సంస్థ సమన్వయంతో స్టేడియం అభివృద్ధి జరుగుతుండటం అభినందనీయమన్నారు. రాబోయే మూడు సంవత్సరాలలో ప్రతి గ్రామం, పట్టణం, నగరంలో క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ ఆంధ్రప్రదేశ్‌ను క్రీడా రంగంలో అగ్రగామిగా తీర్చిదిద్దుతామని తెలిపారు. క్రీడల అబివృద్ధి కోసం ఎంపీ చిన్ని అనేక దఫాలు కేంద్ర క్రీడల శాఖా మంత్రిని కలసి విన్నవించడం జరిగిందన్నారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో త్వరలో జరగనున్న ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్ ) మ్యాచ్‌లను అమరావతిలో ప్రారంభించి కడపలో ముగించాలనే ప్రతిపాదనను స్వాగతిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని మంత్రి ఎం. రాంప్రసాద్ రెడ్డి హామీ ఇచ్చారు.ఎంపి కేశినేని చిన్ని మాట్లాడుతూ విజయవాడ వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరమని, అమరావతి రాజధానిగా శాశ్వత గుర్తింపు రావడంతో నగరానికి మరింత అభివృద్ధి అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విశాఖపట్నం, తిరుపతి, విజయవాడ నగరాల్లో క్రీడా వసతులు మెరుగుపడుతున్నాయని తెలిపారు. స్టేడియాన్ని సుమారు రూ.185 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. అమరావతిలో 2500 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ, అలాగే స్పోర్ట్స్ యూనివర్సిటీ స్థాపనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. 2029 నాటికి విజయవాడ, అమరావతిలో నేషనల్ గేమ్స్ నిర్వహించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పార్లమెంటు సభ్యులు చెప్పారు. ఎన్టీఆర్ జిల్లాలో సమర్థవంతమైన జిల్లా కలెక్టర్ లక్ష్మీశా, మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, శాప్ ఎండీ భరణి వంటి యంగ్ డైనమిక్ అధికారులు జిల్లా యంత్రాంగంలో ఉన్నారని, ప్రభుత్వ సహకారం పూర్తిగా ఉంటుందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో జిల్లా అభివృద్ధికి ఇంకా అడ్డంకులు ఉండవన్నారు. ఇటువంటి సమర్థవంతమైన యంగ్ అధికారులు జిల్లాలో ఉన్నందుకు తామంతా ఎంతో గర్వంగా ఫీలవుతున్నామని ఎంపీ తెలిపారు. శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు మాట్లాడుతూ స్టేడియం అభివృద్ధిలో ఎంపీ శివనాథ్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. స్టేడియం అభివృద్ధి కోసం పలుమార్లు సందర్శించి మార్గనిర్దేశం చేశారని చెప్పారు. ఎంపీ సూచనల మేరకు స్టేడియంలో ఒక బ్లాక్‌కు ప్రముఖ మహిళా క్రీడాకారిణి పేరు పెట్టనున్నట్లు వెల్లడించారు. వచ్చే ఏడాది నాటికి స్టేడియం పూర్తిగా రూపురేఖలు మారిపోతాయని, అంతర్జాతీయ స్థాయి క్రీడా కార్యక్రమాలను నిర్వహించేలా అభివృద్ధి చేస్తామని తెలిపారు.రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి కృషి చేస్తున్నందుకు, క్రీడాకారులకు సహాయ సహకారాలు అందిస్తున్నందుకు రాష్ట్రంలోని వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్ రెడ్డిని, ఎంపీ కేశినేని చిన్ని ని ఘనంగా గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్,రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, జిల్లా కలెక్టర్ డా. జీ. లక్ష్మీశ, నగర పాలక సంస్థ కమిషనర్ హెచ్ ఎం. ధ్యానచంద్ర,, శాప్ వీసీ అండ్ ఎండీ ఎస్. భరణి, అంతర్జాతీయ చెస్ క్రీడాకారిణి కోనేరు హంపి, మార్కోలైన్స్ పేవ్‌మెంట్స్ టెక్నాలజీస్ లిమిటెడ్ డైరెక్టర్ వెల్లంకి రేవంత్, కృష్ణాజిల్లా గ్రంథాలయ పరిషత్తు చైర్మన్ ఎంఎస్ బేగ్, శాప్ డైరెక్టర్లు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# గుణదల విద్యుత్ సౌధలో ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్

విజయవాడ, ఏప్రిల్ 8 (నేటి శుభోదయ):- ప్రజలకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ అందించడమేకాకుండా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. గుణదల విద్యుత్ సౌధలో ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ నూతన కార్యాలయానికి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె. విజయానంద్, సీఎండీ పి. పుల్లా రెడ్డి లతో కలసి మంత్రి రవికుమార్ బుధవారం ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ ఏపీసీపీడీసీఎల్ (ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్) నూతన కార్యాలయం ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. సిబ్బంది సమిష్టి కృషితో విద్యుత్ శాఖకు మంచి పేరు వచ్చిందన్నారు. సుమారు 35 నుండి 40 కోట్ల రూపాయల వ్యయంతో, 65 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునిక కార్పొరేట్ కార్యాలయాన్ని నిర్మించుకున్నామన్నారు.రాష్ట్రవ్యాప్తంగా కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం వేగంగా జరుగుతోందన్నారు. ప్రభుత్వ లక్ష్యాలు, ఆదేశాలు అనుగుణంగా పనిచేస్తూ. ముఖ్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల ప్రకారం విద్యుత్ ఛార్జీలు పెంచకుండా, నాణ్యమైన విద్యుత్తును నిరంతరం అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పవర్ డిస్టర్బెన్స్ (విద్యుత్ అంతరాయం) ఉండకూడదని, లో-వోల్టేజ్ సమస్యలు తలెత్తకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారని అందుకు అనుగుణంగా సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. వినియోగదారులలో విద్యుత్ శాఖ పట్ల ఉన్న సానుకూల దృక్పథాన్ని ప్రస్తుతం ఉన్న 80% నుండి 95% పైకి తీసుకెళ్లడమే మా లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. రైతులకు పగటిపూట విద్యుత్ పీఎం కుసుమ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు పగటిపూట ఉచిత విద్యుత్ అందించడం కోసం చేపట్టిన టెండర్లు పూర్తయ్యాయని, త్వరలోనే ఈ పనులు ప్రారంభమవుతాయన్నారు. రికార్డు స్థాయి విద్యుత్ ఉత్పత్తి, ఆధునిక పద్ధతులు ఉపయోగించి, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తిని సాధించామన్నారు. పగటిపూట విద్యుత్ డిమాండ్ తక్కువగా ఉన్నప్పుడు కొనుగోలు చేస్తూ, సాయంత్రం పీక్ అవర్స్‌లో మనమే స్వయంగా జనరేట్ చేసుకుంటూ విద్యుత్ లోటు లేకుండా చూస్తున్నామన్నారు. సోలార్, విండ్ (గాలి మళ్ళీ), మరియు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల (గ్రూపు) ద్వారా విద్యుత్ ఉత్పత్తిని పెంచుతున్నామన్నారు. బ్యాటరీ స్టోరేజ్ కోసం ఇప్పటికే 10 చోట్ల టెండర్లు పిలవడం జరిగిందన్నారు. విపత్తు సమయాల్లో విద్యుత్ సిబ్బంది తమ సేవలు నిరంతరాయంగా అందిస్తున్నారన్నారు.



గతంలో వరదలు వచ్చినప్పుడు ముఖ్యంగా విశాఖపట్నంలో తుపాను వచ్చినప్పుడు విద్యుత్ శాఖ సిబ్బంది రేయింబవళ్లు కష్టపడి పనిచేశారన్నారు. దాదాపు 1500 నుండి 2000 మంది సిబ్బంది తమ కుటుంబాలను వదిలి, కేవలం 24 గంటల్లోనే సుమారు 20 వేల విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారన్నారు. రాష్ట్రంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సిబ్బందిని కోరారు. పగలు, రాత్రి తేడా లేకుండా పనిచేసే శాఖగా విద్యుత్ శాఖను మంత్రి రవికుమార్ పేర్కొన్నారు.ఎంపి కేశినేని చిన్ని మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నాణ్యమైన విద్యుత్తును ప్రజలకు అందిస్తూ మెరుగైన సేవల దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. గత ప్రభుత్వ పాలనలో రైతులకు విద్యుత్తు అందించేందుకు పెట్టిన ఇబ్బందులు రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు అన్నారు. విజయవాడ నగరంలో కూడా అనేక ప్రాంతాల్లో అత్యాధునిక విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌లను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ద్వారా గృహ , పారిశ్రామిక విద్యుత్తు కనెక్షన్‌లకు లో ఓల్టేజీ వంటి సమస్యలు లేకుండా ప్రభుత్వం చూస్తోందన్నారు. ఇంకా నగరంలోనూ, జిల్లాలోని పలు ప్రాంతాల్లో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటు అవసరం ఉందని, ఆయా అవసరాలను మంత్రి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కారం చేస్తామన్నారు. ఎనర్జీ సెక్రటరీ విజయానంద్ మాట్లాడుతూ విద్యుత్ కొనుగోలు, అమ్మకాల్లో పారదర్శకత కోసం మానవ ప్రమేయం లేని అత్యాధునిక సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తున్నామన్నారు. ఈ ఏడాది రికార్డు స్థాయిలో 14,009 మెగావాట్ల విద్యుత్ గరిష్ట లోడ్ ను విజయవంతంగా నిర్వహించామన్నారు. ఈ వేసవిలో విద్యుత్ కు ఎటువంటి అంతరాయం లేకుండా 275 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను సరఫరా చేశామన్నారు. ఏపీ జెన్కో ప్లాంట్ల సామర్థ్యాన్ని 85-90% కి పెంచామన్నారు. ఏపీసీపీడీసీఎల్ భవనాన్ని 'నెట్ జీరో' కాన్సెప్ట్ తోపాటు సోలార్ ఎనర్జీ, గ్రీన్ టెక్నాలజీని ఉపయోగించడం ద్వారా విద్యుత్ ఖర్చు తగ్గించడమే కాకుండా కార్బన్ న్యూట్రాలిటీని సాధించాలనే లక్ష్యంగా పెట్టుకుని నిర్మించామన్నారు. సీఎండి పుల్లారెడ్డి మాట్లాడుతూ డిస్కం అధికారులు అందరూ వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమం లో టెక్నికల్ డైరెక్టరు మురళీ కృష్ణ యాదవ్, ప్రాజెక్ట్స్ డైరెక్టర్ టీ వీ ఎస్ ఎన్ మూర్తి, ఫైనాన్స్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, సి. జి.ఎమ్ లు, జిఎమ్ లు పాల్గొన్నారు.

## నీటి నాణ్యత విషయంలో రాజీపడేది లేదు
## నిబంధనలు పాటించని ప్లాంట్లపై కఠిన చర్యలు తప్పవు

: జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ, ఏప్రిల్ 8 (నేటి శుభోదయ):- వేసవి నేపథ్యంలో ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఆర్వో నీటి శుద్ధి ప్లాంట్లు, తాగునీటి సరఫరా వ్యవస్థల్లో విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించాలని, నిరంతర పర్యవేక్షణతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్, వీఎంసీ ప్రత్యేక అధికారి డా. జి.లక్ష్మీశ ఆదేశించారు.కలెక్టర్ లక్ష్మీశ బుధవారం ముత్యాలంపాడు, సత్యనారాయణపురం ఆర్వో ప్లాంటును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ ప్లాంటుకు నీరు ఎక్కడి నుంచి వస్తుంది? అనుమతుల వివరాలు, ఉపయోగిస్తున్న సాంకేతిక పరికరాలు, పరిశుభ్రత ప్రమాణాలు, నాణ్యత పరీక్షల వ్యవస్థ తదితరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రతి తాగునీటి సరఫరా వ్యవస్థ నిర్దేశ ప్రమాణాలు పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన తాగునీరు అందించడం అత్యంత ప్రాధాన్యమని. అన్ని ఆర్వో ప్లాంట్లను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని, షెడ్యూల్ వివరాలను ప్లాంట్ల వద్ద ప్రదర్శించాలని ఆదేశించారు. తనిఖీల సందర్భంగా నీటి నాణ్యత ప్రమాణాలు, ఫిల్టరేషన్ విధానం, యంత్రాల పనితీరు, శుభ్రత పరిస్థితులు, నిర్వహణ విధానం వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. అనుమతులు లేకుండా నడుస్తున్న లేదా నిబంధనలు పాటించని, ప్రమాణాలకు విరుద్ధంగా పనిచేస్తున్న ఆర్వో ప్లాంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వేసవిలో తాగునీటి వినియోగం గణనీయంగా పెరుగుతున్నందున, ప్రజలు ఉపయోగించే నీటి నాణ్యతపై ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. ప్రజలు కూడా ఏవైనా సమస్యలు ఉంటే స్థానిక అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జ్ సీఈ పి.సత్యకుమారి, సీఎంహెచ్‌వో కె.అర్జునరావు తదితరులు ఉన్నారు.

## విజయవాడ నగర అభివృద్ధికి చిత్తశుద్ధితో ఉన్న కూటమి ప్రభుత్వం

: ఎమ్మెల్యే గద్దె



విజయవాడ, ఏప్రిల్ 8 (నేటి శుభోదయ):- విజయవాడ నగర అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్తశుద్ధితో ఉన్నారని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. నగరాభివృద్ధికి నిధులు అవసరం అని అడిగిన వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిధులను మంజూరు చేయడమే అందుకు నిదర్శనమని తెలిపారు. బుధవారం ఉదయం తూర్పు లోని 3వ డివిజన్, సీతారామ నగర్ లో ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పర్యటించారు. స్థానికంగా ఉన్న సమస్యలను ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ.20 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులకు గద్దె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ విజయవాడ నగరానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్తశుద్ధితో ఉన్నారన్నారు. ఆటోనగర్‌లో వాహనాలు రావడానికి చాలా ఇబ్బందిగా ఉందని చెప్పిన వెంటనే ఆటోనగర్‌కు అనుసంధానంగా ఉన్న బల్లెం వారి వీధితో పాటుగా మరో రెండు ప్రధాన రహదారుల విస్తరణకు మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణకు చెప్పి సీఆర్‌డీఏ నుంచి నిధులు మంజూరు చేశారన్నారు. బల్లెం వారి వీధిలో విస్తరణ, నిర్మాణంతో స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆటోనగర్ ప్రాంతానికి వాహనాలు వచ్చి వెళ్ళడానికి కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. గతంలో ప్రభుత్వం దగ్గర నిధులు లేక రోడ్డు నిర్మాణానికి పబ్లిక్ కాంట్రిబ్యూషన్ వసూలు చేసేవారని ఇప్పుడు ప్రజల నుంచి కాంట్రిబ్యూషన్ లేకుండానే అభివృద్ధి పనులు చేస్తున్నామని అన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ఇంకా నిధులు అవసరం అయితే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడితో మాట్లాడి నిధులు మంజూరు చేయించుకుని అభివృద్ధి పనులు చేయిస్తానని ఎమ్మెల్యే గద్దె తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడి బాబురావు, గద్దె రమేష్, ముమ్మనేని ప్రసాద్, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, పేరేపి ఈశ్వర్, మండల విజయకుమార్, బండి కోమలి, పిన్నమనేని ప్రతాప్, ధనయకుల ఎలమందరావు, గొల్లపల్లి నారాయణరావు, దాడి సుబ్బారావు, వి కృష్ణ ప్రసాద్, శంకర్, గల్లా రవి,రాగానే సాయి, ఇ.ఇ. సామ్రాజ్యం, ఎ.ఇ. దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

జగ్గంపేట ఎస్సై రఘునాధరావు



కాకినాడ జిల్లా, జగ్గంపేట, ఏప్రిల్ 08 నేటి శుభోదయ : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని లేకపోతే చర్యలు తప్పవని జగ్గంపేట ఎస్సై టి. రఘునాథరావు హెచ్చరించారు. బుధవారం జగ్గంపేట నుంచి గోకవరం వెళ్లే రహదారిలో ద్విచక్ర వాహన దారులను ఆపి హెల్మెట్ ధారణ పై అవగాహన కల్పించారు. హెల్మెట్ పెట్టుకోకపోవడం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలు పోతాయని వివరించారు. ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తితో పాటు వెనక కూర్చునే వ్యక్తి సైతం హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ ధారణ ప్రాముఖ్యతపై తెలియజేశారు. అలాగే ద్విచక్ర వాహనదారులు లైసెన్సు, ఆర్ సి, ఇన్సూరెన్స్ అన్ని రికార్డులు కలిగి ఉండాలన్నారు. రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తూ ప్రయాణం చేయాలని ఎస్సై రఘునాధరావు వాహనదారులకు సూచించారు.

## మార్టేరు లో ఘనంగా కిసాన్ మేళా

-వచ్చే సంవత్సరం శతాబ్ది వేడుకలకు చంద్రబాబు నాయుడు హాజరు

-రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు



మార్టేరు, ఏప్రిల్ 8 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) గత ఐదేళ్లలో వ్యవసాయం నిర్లక్ష్యానికి గురైందని, గోదావరి జిల్లాల్లో కాలువల అభివృద్ధి జరగలేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు అన్నారు. బుధవారం పశ్చిమగోదావరి జిల్లాపెనుమంట్ర మండలం మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో కిసాన్ మేళా లో పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని సమానంగా తీసుకెళ్తోందని తెలిపారు. రానున్న కాలంలో వ్యవసాయ కాలువల ప్రక్షాళన చేపడతామని, 2027 పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామని పేర్కొన్నారు.అలాగే దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు పేదలకు రూ.2కి కిలో బియ్యం అందించిన ఘనత ఆయనదేనని గుర్తుచేశారు. రైతులు అవసరాలకు అనుగుణంగా పంటలు సాగు చేయాలని, ఆధునిక సాంకేతికతలు, ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగంతో వ్యవసాయం అభివృద్ధి చెందుతుందని సూచించారు. ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతిగా పనిచేస్తోందన్నారు. వచ్చే సంవత్సరం నిర్వహించే 100 సంవత్సరాల వేడుకలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరవుతారని తెలిపారు. పరిశోధనా కేంద్రం ద్వారా రైతులు మెరుగైన విత్తనాలు, తక్కువ పురుగుమందులతో అధిక దిగుబడులు సాధిస్తున్నారని పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ రైతులు పురుగుమందుల వాడకం తగ్గించి భూసారాన్ని, ఆరోగ్యాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. వైస్ చాన్సలర్ శారద మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యతను వివరించారు. రాజ్యసభ సభ్యులుపాకా వెంకటసత్యనారాయణ మాట్లాడుతూ రైతులు శాస్త్రవేత్తల సలహాలు తీసుకుని సాగు చేయాలని సూచించారు.ఈ కిసాన్ మేళా ద్వారా రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, కొత్త వరి రకాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు.

## నేతన్నల గౌరవ జీవనమే లక్ష్యం

-రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత



తాడేపల్లి, ఏప్రిల్ 8 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ )చేనేత కార్మికులకు గౌరవ జీవనం కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకం ప్రారంభించామన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘ ప్రతినిధులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈ నెల 26న నిర్వహించే పద్మ శాలీ మహాసభకు హాజరుకావాలని ఆ సంఘ ప్రతినిధులు మంత్రి సవితను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చేనేతలకు కూటమి ప్రభుత్వంతోనే మేలు జరుగుతోందన్నారు. 50 ఏళ్లు నిండిన చేనేత కార్మికులకు రూ.4 వేల పెన్షన్లు అందజేస్తున్నామన్నారు. ఏటా రూ.5 కోట్ల మేర త్రిఫ్ట్ ఫండ్ నిధులు కేటాయిస్తున్నామన్నారు. నూలుపై 15 శాతం సబ్సిడీ అందజేస్తున్నామన్నారు. నూతన టెక్స్ టైల్స్ పాలసీ తీసుకొచ్చి, రాష్ట్ర వ్యాప్తంగా మెగా క్లస్టర్లు, మినీ క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆప్కో ద్వారా చేనేత ఉత్పత్తుల అమ్మకాలు పెంచేలా చర్యలు తీసుకున్నామన్నారు. . 2,640 మంది చేనేత కార్మికులకు ముద్ర పథకం కింద రూ.24.43 కోట్లు అందజేశారు. చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచేలా చర్యలు తీసుకుంటూ, రాష్ట్ర వ్యాప్తంగా చేనేత ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేస్తున్నారు. 2024 ఏప్రిల్ నుంచి 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు రూ.78.73 కోట్ల నగదు పరపతి సౌకర్యం కల్పించామన్నారు. నేతన్నల ఆరోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దీనిలో భాగంగా యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా నేతన్నల ఆరోగ్య రక్షణకు చర్యలు తీసుకుంటున్నారు. నేతన్నలు గౌరవ ప్రద జీవనం సాగించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు. అంతకుముందు మంత్రి సవిత..పద్మ శాలీ మహాసభ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు జగ్గారపు శ్రీనివాసరావు, ఇతర ప్రతినిధులు మునగపాటి వెంకటేశ్వరరావు, అంజిబాబు, విజయనాగేంద్ర, బండారు బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

## ఎబిఎన్ రాధాకృష్ణ సమాజానికి క్షమాపణ చెప్పాలి

-కృష్ణాజిల్లా జడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక డిమాండ్



విజయవాడ,, ఏప్రిల్ 8( అజయ్ నారగాని - నేటి శుభోదయ): ఏబీఎన్ రాధాకృష్ణ సమాజానికి క్షమాపణ చెప్పాలన్నారు. విజయవాడ ముస్తాబాద్ లోని ఎ. బి. ఎన్. ఆఫీస్ ను ముట్టడించిన వైఎస్ఆర్ సీపీ నేతలు పత్రికా విలువలను దిగజార్చుకుని మహిళలపై అసభ్యంగా మాట్లాడే స్థాయికి దిగజారిన ఏబీఎన్ రాధాకృష్ణ సమాజానికి తక్షణమే క్షమాపణ చెప్పాలని హైదరాబాద్ లోని ఏబీఎన్ కార్యాలయాన్ని ముట్టడించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు పేర్కొన్నారు.ఈ సందర్భంగా పెడన నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఉప్పాల రాము మరియు కృష్ణ జిల్లా జడ్పీ చైర్మన్ ఉప్పాల హారిక మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కుటుంబంపై ఏబీఎన్ రాధాకృష్ణ చేసిన దుర్మార్గపు వ్యాఖ్యలు తీవ్రంగా ఖండనీయమని అన్నారు. జగన్ మాటే మాకు వేదమని, ఆయనను అనుసరిస్తున్న కోట్లాది మంది గురించి మాట్లాడే అర్హత రాధాకృష్ణకు లేదని విమర్శించారు.చంద్రబాబు తానంటే తందాన అంటున్న నేపథ్యంలో, ఏబీఎన్ రాధాకృష్ణ చేసిన విమర్శలను తన కుటుంబ సభ్యులకు కూడా ఆపాదించుకుంటారా అని ప్రశ్నించారు. జగన్ గారిని బద్నాం చేయడానికి ఎల్లో మీడియా పేరుతో రాష్ట్రంలో విషప్రచారం జరుగుతోందని మండిపడ్డారు.రాధాకృష్ణ చేసిన వ్యాఖ్యలపై తక్షణమే క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఉప్పాల రాము హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పెడన నియోజకవర్గ,కృష్ణాజిల్లా మరియు ఎన్టీఆర్ జిల్లాల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కార్యాలయాన్ని ముట్టడించారు.

## అందరి సహకారంతోనే గుడివాడ అభివృద్ధి

-ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

-గత ప్రభుత్వ తప్పిదాల కారణంగా చిన్న సమస్యలే పెద్దవిగా మారాయి



గుడివాడ ఏప్రిల్ 8 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) ప్రజలందరితో కలిసి కూటమి ప్రభుత్వ సహకారంతో గుడివాడ అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఐక్యతతో ముందుకు వస్తే సులభంగా సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఆయన చెప్పారు.గుడివాడ పట్టణం 27, 29 వార్డుల పరిధిలో గల బేతవోలులో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము బుధవారం విస్తృతంగా పర్యటించారు. ముందుగా పర్యటన వార్డులతో పాటుగా 26,30 వార్డుల పరిధిలో విస్తరించి ఉన్న బేతవోలు చెరువు చుట్టూ ఎమ్మెల్యే రాము ద్విచక్ర వాహనంపై కలియతిరిగారు. చెరువులో నీరు నింపకపోవడం వల్ల స్థానికంగా భూగర్భ జలాలు అడుగంటి పోయాయని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. గతంలో చెరువులో నీటిని నింపే నార్త్ సైడ్ కాలువ పూర్తిగా పూడిక పోవడాన్ని గుర్తించారు.అవుట్ ఫ్లో అయిన చంద్రయ్య కాలువకు అనుసంధానంగా లాకులు నిర్మిస్తే తాజాగా చెరువులో నీరు నింపే అవకాశం ఉంటుందని స్థానిక పెద్దలు, అధికారులతో మాట్లాడి ఎమ్మెల్యే రాము తెలుసుకున్నారు. స్థానికులు ఏకాభిప్రాయంతో ముందుకు వచ్చి వినతి పత్రం అందిస్తే, డ్రాప్ నిర్మిస్తామని ఎమ్మెల్యే రాము భరోసా ఇచ్చారు. అనంతరం27,29 వార్డుల పరిధిలో గల బేతవోలు, చిన్న పేట, డి మార్ట్ రోడ్డు, సాయి నగర్ కాలనీలో పర్యటించి రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిశీలించారు. అధికారులతో సమస్యల పరిష్కారానికి ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన తప్పులకు నేటికీ ప్రజలు మూల్యం చెల్లించవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వార్డుల్లో కనీస పనులు కూడా చేయకపోవడంతో, చిన్న సమస్యలే నేడు పెద్దవిగా మారాయన్నారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు అర్బన్ గ్రీనింగ్ నిధులతో బేతవోలు చెరువుతోపాటుగా, పార్కు మరియు పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. ఐక్యతతో ముందుకు వస్తే, సమస్యలను సులభంగా పరిష్కరించవచ్చని, ప్రతి ఒక్కరు సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉన్న అవకాశాలపైనే దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే రాము సూచించారు.జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, కమిషనర్ సింహాద్రి మనోహర్, మున్సిపల్ ఎం.ఈ ప్రసాద్, కూటమి నాయకులు పాలంకి సారధి, పంద్రాజు సాంబశివరావు, రామదేని వేణుబాబు, పోలాసి ఉమా, కంచనపల్లి సుబ్రహ్మణ్యం, వడ్డే గిరి, శేషం మురళి, కంచనపల్లి సీతారాం, పంచకర్ల మహేష్, తిరుపతిరావు, చీకటి సూర్య, నారాయణ, పులపర్తి డేవిడ్,బూరగడ్డ వెంకటేశ్వరరావు, పెద బుజ్జి, శౌంటి శ్రీను, దుర్గారావు, కాగిత శివశంకర్, ఆదినారాయణ, రెడ్డప్పారావు, మున్సిపల్ అధికారులు, సచివాలయాల సిబ్బంది, స్థానిక పెద్దలు తదితరులు ఎమ్మెల్యే రాము పర్యటనలో పాల్గొన్నారు.



## వడ్లమన్నాడు మురికి కాలువలో పూడికతీత పనులకు అంచనాలు తయారుచేయాలి

-కృష్ణాజిల్లా కలెక్టర్ డి. కే. బాలాజీ



మచిలీపట్నం ఏప్రిల్ 8 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) వడ్లమన్నాడు గ్రామం లోని మురికి కాలువలో పూడిక తీత పనులకు అంచనాలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ గుడివాడ నియోజకవర్గం గుడ్లవల్లేరు మండలంలోని వడ్లమన్నాడు గ్రామంలో మురికి కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం, గరిసపూడి రాంబాబు తదితర గ్రామస్తులు మాట్లాడుతూ మురికి కాలువలో పూడిక ఎక్కువగా పేరుకుపోయి గట్టిపడిపోయిందని, దీంతో వరదల సందర్భంగా వరద నీరు సరిగా ప్రవహించక పంట పొలాలను ముంచి వేయడంతో చాలా నష్టపోతున్నామని పూడిక తొలగించాలని కలెక్టర్కు విజ్ఞప్తి చేశారు.జిల్లా కలెక్టర్ వెంటనే స్పందిస్తూ కాలువలో పూడికను తొలగించేందుకు అంచనాలు సిద్ధం చేయాలని, పూడికను పూర్తిగా తొలగించి వరద నీరు పొంగి పంట పొలాలు మునిగిపోకుండా సజావుగా ప్రవహించే విధంగా ఏర్పాటు తప్పనిసరిగా చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అంతకు మునుపు జిల్లా కలెక్టర్ గూడూరు నుండి వడ్లమన్నాడుకు వచ్చే మార్గంలో నక్కలపాలెంలో గ్రామస్తులు తాము 50 కుటుంబాలు ఉంటున్నామని, గ్రామానికి రహదారి మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్కు విజ్ఞప్తి చేయగా పరిశీలిస్తామని చెప్పారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట జలవనరుల శాఖ డ్రైనేజీ డివిజన్ కిరణ్ బాబు, గుడ్లవల్లేరు మండల తహసిల్దారు లోకరాజు, ఎంపీడీవో ఇమ్రాన్ పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



# రు. 105కోట్లతో మూడు మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ

పెనమలూరు, ఏప్రిల్ 8 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) శాసన సభ్యుడు బోడే ప్రసాద్ విజ్ఞప్తి మేరకు రోడ్ల అభివృద్ధికి 7 కోట్ల రూపాయలు మరియు పెనమలూరు నియోజకవర్గం లో తాడిగడప మున్సిపాలిటీ అభివృద్ధికి 52 కోట్లు మంజూరు చేయడం చేయడం జరిగిందని మునిసిపల్ శాఖా మంత్రి పొంగూరు నారాయణ అన్నారు.కానూరు సనత్ నగర్లో 105 కోట్లతో మూడు మాస్టర్ ప్లాన్ రోడ్లు అభివృద్ధి పనులకు సంఖుస్థాపనచేసిన అనంతరం మాట్లాడుతూ సనత్ నగర్ ప్రజల చిరకాల కోరిక నెరవేర్చినందుకు బోడే ప్రసాద్ కు అభినందనలు తెలిపారు.గత ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీ నిధులను కూడా వేరే వాటికి మళ్లించారన్నారు.కూటమి ప్రభుత్వం ఏర్పడినాక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏ మున్సిపాలిటీ నిధులు వారికే అని ప్రకటించారన్నారు.రాష్ట్రంలో ఉన్న123 మున్సిపాలిటీలకు రోడ్లు డ్రైనేజీలు ప్రాధాన్యతీస్తూ,ప్రతి ఇంటికి తాగునీరు ఇచ్చే విధంగా 14 వేల కోట్ల రూపాయలతో టెండర్లు పిలిచామన్నారు. డ్రైనేజీల నిర్మాణానికి మరో 9 వేల కోట్లు శాంక్షన్ చేశాము అన్నారు.ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ హిందువులు ముస్లింలు ఐక్యంగా నివసిస్తూ ఆటోనగర్లో పనిచేసుకుంటూ ఉండే ప్రాంతం సనత్ నగర్ అన్నారు. ఎన్నికల ముందు వర్షం పడితే డ్రైనేజీ నీరు రోడ్లమీద పొంగి మోకాలు లోతు నీళ్లల్లో కార్మికులు వృద్ధులు మహిళలు ప్రయాణం చేయలేక ఎవరు ఇబ్బందులు పడేవారు, అటువంటి రోడ్డుని కూటమీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అద్దంలాగా మార్చి సనత్ నగర్ ప్రజలకు అంకితం చేశామన్నారు.2014లో నారాయణ మంత్రిగా శాసనసభ్యులుగా నేను ఉన్నప్పుడు సనత్ నగర్ లో పంట కాలవ రోడ్డును మంత్రి నారాయణ సహకారంతో వేసుకున్నాము,ఇప్పుడు చిన్న రోడ్డుని పెద్ద రోడ్డుగా వేసుకున్న విషయాన్ని మైనార్టీ సోదరులు గుర్తుపెట్టుకోవాలి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన రెండు సంవత్సరాల్లోనే కానూరులో 40 కోట్ల తో డ్రైనేజీలు,రోడ్లు అభివృద్ధి చేశామన్నారు. మహానాడు రోడ్డు ని ఆటోనగర్ నుంచి పోరంకి, నిడమానూరు రోడ్డు వరకు డివైడర్ లైటులతో అభివృద్ధి చేయడానికి శంకుస్థాపన చేసుకున్నామన్నారు. వాల్ మార్ట్ రోడ్డు,బల్లెం వారి వీధిని నాలుగు లైన్లు రోడ్డుగా అభివృద్ధి చేస్తాం,ఇన్ని రోడ్లు అభివృద్ధి చేసినందుకు మైనార్టీ సోదరులు కూటమి ప్రభుత్వాన్ని గుర్తుపెట్టుకొని ఆశీర్వదించాలని కోరారు.గత ప్రభుత్వం చేసిన విధ్వంసాన్ని, గాయాన్ని పూడ్చుకుంటూ నిధులు సమీకరిస్తూ అభివృద్ధి చేస్తున్నామన్నారు.తాడిగడప మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని పిలుపునివ్వడంతో రాష్ట్రంలోనే అత్యధిక పన్నులు కట్టిన తాడిగడప మున్సిపాలిటీగా పేరు సాధించామన్నారు. పెనమలూరు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించిన మంత్రి నారాయణ కి,ఎంపీ బాలశౌరికి కృతజ్ఞతలు తెలియజేశారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అభివృద్ధి అనేది ఎక్కడా లేదు కేవలం సంక్షేమం చేసి అభివృద్ధిని గాలికి వదిలేశారన్నారు.రాష్ట్రాన్ని గుంతల మయంగా చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు.జగన్మోహన్ రెడ్డి హయాంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలన్న భయపడే పరిస్థితి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినాక పెట్టుబడులు వెళ్ళువల వస్తున్నాయని తెలిపారు.పెనమలూరు నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకు పోతుందన్నారు.రోజుకు ఒక అభివృద్ధి పని చొప్పున 700 అభివృద్ధి పనులుకు బోడే ప్రసాద్ పునాది వేశారన్నారు.నేడు 105 కోట్లతో మాస్టర్ ప్లాన్ కు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు.ఈ రోడ్ ట్రాఫిక్ సమస్య,యాక్సిడెంట్లు తగ్గుతాయని అన్నారు... గ్రేటర్ విజయవాడ ప్రణాళిక,మౌలిక సదుపాయాల కల్పన విజయవాడ విశ్వ నగరంగా వ్యాప్తి చెందనుందన్నారు .పెనమలూరు, గన్నవరం, మైలవరం అనధికారికంగా ఇప్పటికే విజయవాడలో కలిశాయన్నారు.గ్రేటర్ విజయవాడ తో నగర రూపురేఖలు మారి పెండింగ్లో ఉన్న పనులన్నీ కూడా త్వరతగిన విధంగా పూర్తవుతాయన్నారు.యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ మావిగన్ అభివృద్ధి చేస్తానని జగన్ చెప్తున్నాడని,ఇక్కడ ప్రజలు గమనించాల్సింది ఏమిటంటే ఇప్పటికే పెనమలూరు అభివృద్ధి జరిగింది,తమ ఎంపీ మచిలీపట్నం అభివృద్ధిలో ముందంజ ఉంచుతున్నారని , గుంటూరు బాగా అభివృద్ధి చెందుతుంది అన్నారు. మావిగన్ అభివృద్ధి జరిగిపోయిందని ఇప్పటికైనా అమరావతి రాజధానిగా ఒప్పుకుంటే బాగుంటుందని బొత్స సత్యనారాయణకి సూచించారు. దేశంలో 543 మంది పార్లమెంట్ సభ్యులు ఉండగా 539 మంది సభ్యులు అమరావతికి బిల్లుకు మద్దతు తెలిపారు.245 మంది రాజ్యసభ సభ్యులు ఉండగా 238 మంది బిల్లుకు మద్దతు ఇచ్చారు.ప్రధాన ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తానంటూనే జగన్ ఏ హోదా ఉందంటూ పార్లమెంటులో వాకౌట్ చేశారో చెప్పాలన్నారు. అమరావతి తో పెట్టుకున్నందుకు 11 సీట్లకు పరిమితమైన జగన్ రాబోయే కాలంలో తన కార్యకర్తలను కూడా పార్టీ నుంచి బయటకు వెళ్లిపోవడం ఆపలేడు అన్నారు.ఇప్పటికైనా జగన్ మావిగన్ నినాదం మానివేసి అమరావతికి జై కొట్టాలి అని పిలుపునిచ్చారు.గన్నవరాన్ని విజయవాడ కార్పొరేషన్ లో కలపాలి అని మంత్రి నారాయణ కు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు విజ్ఞప్తి చేశారు.మచిలీపట్నం ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ ఒక స్కూల్ టీచర్ గా ప్రారంభమైన నారాయణ జీవితం నేడు అమరావతి అభివృద్ధిలో కీలక పాత్ర పోషించడం మామూలు విషయం కాదన్నారు.బోడే ప్రసాద్ నియోజకవర్గ అభివృద్ధి విషయంలో ఎక్కడ రాజీ పడకుండా ఒక ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్తున్నారని అన్నారు. పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధాని అమరావతిని బిల్లు పాసైనప్పుడు రాష్ట్ర ఎంపీగా సంతోషపడ్డానన్నారు. 2024 ఎన్నికల్లో అమరావతి రాజధానిగా కొనసాగిస్తామని ఏజెండాతోనే కూటమి ప్రభుత్వం ముందుకు సాగిందన్నారు. అమరావతికి జై కొడుతూ కూటమి ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రజలు ఆశీర్వదించారని అన్నారు. అమరావతిని వ్యతిరేకించిన జగన్మోహన్ రెడ్డిని 11 సీట్లకు పరిమితం చేశారన్నారు.వైజాగ్ ను ఒక రాజధాని చేస్తాను అన్న జగన్ మోహన్ రెడ్డి అక్కడ కూటమి అభ్యర్థిని రాష్ట్రంలోని అత్యధికంగా అమరావతికి జై కొడుతూ 5 లక్షల పైచిలుకు మెజారిటీని అందించారని పేర్కొన్నారు.వైజాగ్ లో పార్లమెంటు,అసెంబ్లీ సీట్లను కూటమికి ప్రజలు ఇచ్చి అమరావతికి అనుకూలమైన తీర్పు ఇచ్చారన్నారు. అమరావతి అనే సరికి సెల్ఫ్ ఫైనాన్స్ సిటీగా అభివృద్ధి చెందుతుందని, నేషనల్ బ్యాంకులు 50వేల కోట్లతో అక్కడ వ్యాపార సామ్రాజ్యాన్ని నెలకొల్పుతున్నాయని అన్నారు.తెలంగాణ హైదరాబాద్ కు దిల్సుఖ్ నగర్ ఎలాంటిదో అమరావతికి పెనమలూరు అలాంటిది అని అన్నారు.సుమారు 14 వేల కోట్ల రూపాయలతో రాష్ట్రంలోని మున్సిపాలిటీలలో నీటి సమస్య తలెత్తకూడదని మంత్రి నారాయణ పనిచేస్తున్నారన్నారు. మన సరిహద్దు ప్రాంతంలో ఉన్న కృష్ణానది లో 18 టీఎంసీల నీరు సముద్రపాలు అయిందన్నారు. ముఖ్యమంత్రి ,ఉప ముఖ్యమంత్రి తలుచుకుంటే మన జిల్లాకు 15 టీఎంసీల త్రాగునీరు అందించవచ్చు అన్నారు.వైసిపి వాళ్లు పూటకో మాట మాట్లాడతారు కాసేపు మూడు రాజధానులు, ఇప్పుడేమో మావిగన్ అంటూ మతిలేని మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. వాళ్లు అలా మాట్లాడినంత కాలం అధికారం కూటమి ప్రభుత్వానిదే అని తెలిపారు.ఒక చక్కటి కలయికతో ఎవరు విడదీయలేే నటువంటి సంకల్పంతో 15 సంవత్సరాలు అభివృద్ధి కట్టుబడి కూటమి ప్రభుత్వం సాగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వీరంకి గురుమూర్తి, కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు వెలగపూడి శంకర్ బాబు రాష్ట్ర గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ శౌంఠి శివరామ ప్రసాద్ గౌడ్ రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పీత గోపీచంద్ రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ తాతపూడి గణేష్ పెనమలూరు మండల పార్టీ అధ్యక్షులు కోయ ఆనంద ప్రసాద్ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు సంగేపు రంగారావు షేక్ బుజ్జి దోనేపూడి రవి కిరణ్ షేక్ ఇమామ్ బొంగరాల అబ్రహం ముప్పా రాజా ముప్పా రాజా యార్లగడ్డ సుచిత్ర మేడసాని రత్నకుమారి కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, తదితరలు పాల్గొన్నారు.





# మైక్రోసాఫ్ట్, ఆపిల్‌కు చెక్‌పెట్టేందుకు.. ఆండ్రాయిడ్ ఓఎస్‌తో పీసీని తీసుకురానున్న గూగుల్..!




ప్రస్తుతం అందరికీ కంప్యూటర్లు అనగానే గుర్తుకు వచ్చేది మైక్రోసాఫ్ట్ ఆపరేటింగ్ సిస్టమ్. స్మార్ట్ ఫోన్ అనగానే గుర్తుకు వచ్చేది ఆండ్రాయిడ్ ఓఎస్. మీరు ఆండ్రాయిడ్ ప్రియులైతే మీకో గుడ్‌న్యూస్. త్వరలో ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్‌తో నడిచే కంప్యూటర్లు రాబోతున్నాయి. ప్రముఖ టెక్ దిగ్గజం గూగుల్ ఆండ్రాయిడ్ పీసీని అభివృద్ధి చేస్తున్నట్లు ప్రకటించింది. అంటే ఇకపై మొబైల్ తరహా ఓఎస్ కంప్యూటర్, ల్యాప్‌టాప్‌ల్లో తీసుకురాబోతుందన్నమాట. వాస్తవానికి ప్రస్తుతం కంప్యూటర్ల ఓఎస్ విషయంలో మైక్రోసాఫ్ట్‌తో పాటు ఆపిల్ మ్యాక్ ఓఎస్ హవా కొనసాగుతున్నది. గూగుల్ క్రోమ్ ఓఎస్ పేరుతో ఆపరేటింగ్ సిస్టమ్‌ను తీసుకువచ్చేందుకు ప్రయత్నించినా పెద్దగా ఆకట్టుకోలేకపోయింది. తాజాగా ఈ రెండు దిగ్గజ సంస్థలకు పోటీ ఇచ్చేందుకు మరోసారి పీసీ ఓఎస్‌పై దృష్టి పెట్టి ఆండ్రాయిడ్ ఓఎస్‌పై పని చేస్తోంది. ఆండ్రాయిడ్, క్రోమ్ ఓఎస్‌లను విలీనం చేయనున్నది. ఈ విషయాన్ని హవాయిలో జరిగిన స్నాప్‌డ్రాగన్ సమ్మిట్‌లో గూగుల్ ప్రతినిధి ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ రెండింటిని విలీనం చేయనున్నారని గతంలోనూ రూమర్స్ వినిపించాయి. క్వాల్కమ్ సీఈవో క్రిస్టియానో అమోన్‌తో సంభాషణల సందర్భంగా గూగుల్ ప్లాట్‌ఫారమ్, డివైజెస్ చీఫ్ రిక్ ఓస్టర్‌లో ఈ విషయాన్ని ధ్రువీకరించారు. గతంలో తాము పీసీలు, స్మార్ట్‌ఫోన్ల కోసం పూర్తిగా వేర్వేరు వ్యవస్థలను తీసుకువచ్చాయని.. కానీ, రెండింటినీ విలీనం చేసేందుకు ఓ ప్రాజెక్ట్‌ను ప్రారంభించామన్నారు. తమ పీసీ, డెస్క్‌టాప్ కంప్యూటింగ్ సిస్టమ్‌లకు సాధారణమైన సాంకేతిక పునాదిని నిర్మిస్తున్నామని ఓస్టర్‌లో పేర్కొన్నారు. ఇది కొత్త దశ ఏఐని మరింత మెరుగుపరుస్తుందని ఓస్టర్‌లో తెలిపారు. ఏఐ జెమిని మోడల్, గూగుల్ అసిస్టెంట్, పీసీ స్పేస్‌లో మొత్తం డెవలపర్ కమ్యూనిటీని ఉపయోగించుకునే మరొక మార్గమని.. ప్రతి కంప్యూటింగ్ వర్గంలోని ప్రజలకు ఆండ్రాయిడ్ సేవలు అందించగల మరో మార్గమని తాను భావిస్తున్నాన్నారు. క్వాల్కమ్ సీఈవో క్రిస్టియాలో గూగుల్ ప్రాజెక్టును ప్రశంసిస్తూ అద్భుతమని పేర్కొన్నారు. తాను దాన్ని చూశానని.. మొబైల్, పీసీలను విలీనం చేయాలనే కలను నెరవేరుస్తుందన్నారు. గూగుల్ గతంలో క్రోమ్‌ఓఎస్, ఆండ్రాయిడ్‌లను ఒకే ప్లాట్‌ఫామ్‌లోకి విలీనం చేయాలని కోరుకుంటున్నట్లుగా గతంలో ప్రకటించింది. ఈ కొత్త ఆండ్రాయిడ్ పీసీ ప్రాజెక్ట్ ఆ దిశలో ప్రధాన అడుగు కావొచ్చని టెక్ నిపుణులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా.. క్వాల్కమ్ మరో కీలక ప్రకటన చేసింది. త్వరలో కొత్త స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ జెన్ 5 చిప్‌సెట్‌ను తీసుకువస్తున్నట్లు ప్రకటించింది. ఈ చిప్‌సెట్ వచ్చే ఏడాది అనేక హై-ఎండ్ ఆండ్రాయిడ్ ఫోన్లలో రానున్నది. షియోమి తన షియోమి 17 సిరీస్‌లో ఈ చిప్‌సెట్‌ను ఉపయోగించనున్నట్లు ధ్రువీకరించింది. వన్ ప్లస్ 15, ఐక్యూ 15, రియల్ మీ 8 ప్రోమవంటి ఇతర డివైజ్‌లు సైతం ఇదే ప్రాసెస్‌తో వచ్చే అవకాశం ఉంది.




# భారతదేశంలోనే కాదు.. ఈ దేశాల్లోనూ వినాయకుడికి ఆలయాలు ఉన్నయ్..!

భారతదేశంలోని అతిపెద్ద పండుగలలో వినాయక చవితి ఒకటి. విజ్ఞానం, విజయం, అదృష్టానికి వినాయకుడు ఆదిదైవం. పనిలో అడ్డంకులను తొలగించి శ్రేయస్సు అందించే దేవుడిగా గణపతిని పూజిస్తారు. ప్రతి సంవత్సరం వినాయక చవితి పండుగను దేశ ప్రజలు ఎంతో వైభవంగా, ఉత్సాహంతో, భక్తితో జరుపుకుంటారు. కుల మతం భేదం లేకుండా హిందూవులతో పాటు ముస్లింలు కూడా కలిసిఉండి ఈ పండుగను జరుపుకుంటారు. వినాయక చవితి రోజున దేశంలోని ప్రముఖ గణేష్ ఆలయాలు అంగరంగ వైభవంగా అలంకరించబడతాయి. ఉదాహరణకి ముంబయిలోని సిద్ధివినాయక దేవాలయం, మహారాష్ట్రలోని అష్టవినాయక దేవాలయం, కేరళలోని మయూర్ మహాగణపతి దేవాలయం, గణేష్ టోక్ టెంపుల్ గంగ్‌టక్, తమిళనాడులోని పిళ్లయార్ టెంపుల్, ఆంధ్రప్రదేశ్‌లోని కాణిపాకం గణపయ్య, త్రినేత్ర గణేష్ రణతంబోర్ వంటి ఆలయాలు ప్రసిద్ధి పొందాయి. మన దేశంలోనే కాకుండా ప్రపంచంలో కూడా వినాయకుడిని దేవుడిగా పూజిస్తారు.

### పిళ్లయార్ టెంపుల్, శ్రీలంక

తమిళంలో వినాయకుడిని పిళ్లయార్ అంటారు. శ్రీలంకలో అరియాలై సిద్ధివినాయకర్ దేవాలయం, కటరగామ దేవాలయం ముఖ్యమైనవి. శ్రీలంక భక్తులతో పాటు భారతదేశం నుంచి కూడా భక్తులు ఇక్కడికి వస్తారు.

### సూర్యవినాయక దేవాలయం, నేపాల్

నేపాల్, భారతదేశానికి పక్కనే ఉన్న దేశం. అత్యధిక హిందువులు నివసించే దేశంలో భక్తపూర్ జిల్లా, ఖాట్మండు సరిహద్దులో సూర్యవినాయక దేవాలయం ఉంది. ఇది ఖాట్మండులోయిలోని నాలుగు ప్రసిద్ధ గణేశ దేవాలయాలలో ఒకటి. జలవినాయక గణేష దేవాలయం కూడా ఇక్కడ ప్రాచుర్యం పొందింది.

### సితి వినాయగర్ టెంపుల్, మలేషియా

మలేషియాలోని సెలంగోర్‌లోని పెటాలింగ్ సమీపంలో ఈ ఆలయం ఉంది. పీజే పిళ్లైయార్ దేవాలయం అని కూడా పిలుస్తారు. ముఖ్యంగా తమిళ ప్రజలు ఎక్కువగా పూజలకు వస్తారు.

### గణేశ దేవాలయం, థాయిలాండ్

ఇక్కడ గణేశుడి విగ్రహాలు చాలానే ఉన్నాయి. హువాయ్ క్వాంగ్ స్క్వేర్‌లోని గణేశ దేవాలయం ప్రముఖమైంది.. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన గణేశ విగ్రహం కూడా ఇక్కడ ఉంది. ప్రతి సంవత్సరం లక్షలాది భక్తులు ఈ విగ్రహాన్ని దర్శించేందుకు వస్తారు.



### సెల్వవినాయకర్, నెదర్లాండ్స్

డెన్ హెల్డర్‌లో ఉన్న శ్రీ వరతరాజ సెల్వవినాయకర్ ఆలయం యూరోప్‌లో ప్రసిద్ధి చెందింది. 1991లో శ్రీలంక నుంచి వచ్చిన తమిళులు దీన్ని నిర్మించారు. హిందూయిజం ప్రపంచవ్యాప్తంగా వ్యాప్తి చెందేందుకు ఈ ఆలయం సేవలందిస్తోంది.

### బ్రహ్మ వినాయకుడు, మయన్మార్

హిందూ విశ్వాసం ప్రకారం వినాయకుడు మొదటి పూజలందుకునే దేవుడు. కానీ, మయన్మార్‌లో గణేషుడిని బ్రహ్మదేవుడిగా భావిస్తారు. ఈ దేశంలో గణేష్ చతుర్థి వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు.

### ఇండోనేషియాలో ఆలయాలు..






ఇండోనేషియా ముస్లిం దేశం. ముస్లిం దేశమైనప్పటికీ గణపతిని ఇక్కడ గౌరవిస్తారు. బాలి దీవిలో అనేక గణపతి ఆలయాలు ఉన్నాయి. ప్రతి విద్యాసంస్థ, నిర్మాణ సంస్థల్లో వినాయక విగ్రహాలు ఉంటాయి. ఇండోనేషియా కరెన్సీ నోటుపై కూడా గణపతి బొమ్మ ఉంది. ఇక్కడ గణేష్ ఉత్సవాలు ఘనంగా జరుపుతారు.

### మహావల్లభ వినాయక దేవాలయం, అమెరికా


అమెరికా దేశం న్యూయార్క్ నగరంలో వినాయక ఆలయం ఉంది. మహావల్లభ వినాయక దేవాలయాన్ని నిర్మించారు. ఈ ఆలయాన్ని ఫ్లషింగ్ టెంపుల్‌గా పిలుస్తుంటారు. ఈ దేశంలోనూ అనేక ప్రదేశాల్లో దేవాలయాలు సైతం ఉన్నాయి.

# గంటకు 2.21లక్షల కిలోమీటర్ల వేగంతో అట్లాస్ తోకచుక్క ప్రయాణం.. నాసా ఏం చెప్పిందంటే..?



సౌరకుటుంబం ఆవల నుంచి వేగంగా దూసుకువస్తున్న '3ఐ/అట్లాస్' అనే తోకచుక్కతో భూమికి ఎలాంటి ప్రమాదం లేదని నాసా స్పష్టం చేసింది. సెకనుకు 61 కిలోమీటర్ల (అంటే గంటకు సుమారు 2.21 లక్షల కిలోమీటర్ల వేగం) అసాధారణ వేగంతో ఈ తోక చుక్క ప్రయాణిస్తుంది. ప్రస్తుతం ఈ తోకచుక్క కదలికలను నిరంతరం గమనిస్తున్నామని.. దాంతో భూమికి ఎలాంటి ప్రమాదం ఉండబోదని పేర్కొంది. మన సౌర వ్యవస్థకు చెందని ఖగోళ వస్తువులను గుర్తించడం ఇది మూడోసారి. గతంలో 2017లో 'ఔమువాముఅ', 2019లో '2ఐ/బోరిసోవ్'ని శాస్త్రవేత్తలు గుర్తించారు. తాజాగా అట్లాస్ తోకచుక్క సౌరకుటుంబం ఆవల నుంచి వస్తున్న మూడో అతిథిగా పేరుకుంటున్నారు. దాని పేరులో 'ఐ' అక్షరం 'ఇంటర్‌స్టెల్లార్'ని సూచిస్తున్నది. ఈ తోకచుక్కను తొలిసారిగా ఈ ఏడాది జులై 1న చిలీలోని రియో హర్టాడోలో ఉన్న అట్లాస్ టెలిస్కోప్ ద్వారా శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ తోకచుక్క సూర్యుడికి దగ్గరయ్యే కొద్దీ దీని వేగం మరింత పెరుగుతుంది నాసా పేర్కొంది. అక్టోబర్ 30 నాటికి ఇది సూర్యుడికి అత్యంత సమీపంగా.. అంటే సుమారు 21 కోట్ల కిలోమీటర్ల దూరానికి చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. ఇది అంగారక గ్రహ కక్ష్యకు కొద్దిగా లోపలి భాగంలో ఉంటుంది. భూమికి, ఈ తోకచుక్కకు మధ్య దూరం చాలా ఎక్కువగా ఉంటుందని నాసా క్లారిటీ ఇచ్చింది. ఈ తోకచుక్క భూమికి అత్యంత దగ్గరగా వచ్చినప్పుడు కూడా దాని దూరం సుమారు 27 కోట్ల కిలోమీటర్లు ఉంటుందని.. కాబట్టి భూమికి దీనివల్ల ఎలాంటి ముప్పు లేదని తెలిపింది. హబుల్, జేమ్స్ వెబ్ వంటి శక్తిమంతమైన టెలిస్కోపుల ద్వారా దీని గమనాన్ని నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. అక్టోబర్ చివరిలో సూర్యుడి దగ్గర నుంచి ప్రయాణించి, మార్చి 2026 నాటికి బృహస్పతిని దాటి తిరిగి మన సౌర వ్యవస్థ నుంచి శాశ్వతంగా దూరంగా వెళ్లిపోతుందని శాస్త్రవేత్తలు అంచనా వేశారు.


# లివర్ క్యాన్సర్ ఎందుకు వస్తుంది..? ఇది ఉంటే కనిపించే లక్షణాలు.. తీసుకోవాల్సిన ఆహారాలు..!



ప్రపంచ వ్యాప్తంగా ఏటా అధిక శాతం మందిని కబలిస్తున్న ప్రధాన వ్యాధుల్లో క్యాన్సర్ ఒకటి. ఇది శరీరంలో అనేక భాగాలకు వస్తుంది. అలాగే లివర్‌కూ వ్యాప్తి చెందుతుంది. లివర్ క్యాన్సర్ అనేది ఒక తీవ్రమైన, ప్రాణాంతక వ్యాధి. ఈ వ్యాధి వచ్చిన వారిలో లివర్ కణాలు డ్యామేజ్ అవుతాయి. దీంతో పలు తీవ్రమైన లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలను గమనిస్తే లివర్ క్యాన్సర్ ఉన్నట్లు ముందుగానే గుర్తించవచ్చు. దీంతో చికిత్స తీసుకుని లివర్ ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చు. దీని వల్ల ప్రాణాంతకం కాకుండా సురక్షితంగా ఉండవచ్చు. లివర్ క్యాన్సర్ ఉన్నవారిలో శరీరం పలు లక్షణాలను, సంకేతాలను తెలియజేస్తుంది.

### లివర్ క్యాన్సర్ లక్షణాలు..

లివర్ క్యాన్సర్ ప్రారంభంలో ఉన్నా కొందరిలో పలు లక్షణాల కనిపిస్తాయి. ఎలాంటి కారణం లేకుండానే ఉన్నట్లుండి సడెన్‌గా బరువు తగ్గిపోతుంటారు. ఆకలి ఉండదు. కాస్త తిన్నా కూడా కడుపు నిండిన భావన కలుగుతుంది. ఆహారం సహించదు. కడుపులో నొప్పిగా ఉంటుంది. వికారంగా ఉంటుంది. వాంతికి వచ్చినట్లు అనిపిస్తుంది. పచ్చ కామెర్లు వస్తాయి. అవి ఎన్ని రోజులు ఉన్నా కూడా తగ్గవు. పొట్ట మొత్తం ఉబ్బిపోయి కనిపిస్తుంది. చిన్న పనిచేసినా తీవ్రమైన అలసటగా అనిపిస్తుంది. నీరసంగా ఉంటారు. మూత్రం ముదురు రంగులో వస్తుంది. చిన్నపాటి దెబ్బ తగిలినా సులభంగా రక్తస్రావం అవుతుంది. చర్మం బాగా కందిపోయినట్లు అవుతుంది. ఇవన్నీ లివర్ క్యాన్సర్ వచ్చిందని తెలిపే లక్షణాలు.



### లివర్ క్యాన్సర్‌కు కారణాలు..

లివర్ క్యాన్సర్ వచ్చేందుకు అనేక కారణాలు ఉంటాయి. లివర్ సిర్రోసిస్ అనే సమస్య దీర్ఘకాలంగా ఉన్నవారికి, హెపటైటిస్ ఇన్‌ఫెక్షన్లు ఉన్నా, మద్యం విపరీతంగా సేవిస్తున్నా, నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ అనే సమస్య ఉన్నవారిలో, టైప్ 2 డయాబెటిస్ లేదా మెటబాలిక్ సిండ్రోమ్ అనే సమస్య ఉన్నవారిలో, ఫంగస్ ఇన్ఫెక్షన్లు దీర్ఘకాలంగా ఉంటే, స్థూలకాయం ఉన్నవారిలో, పొగ తాగేవారికి లివర్ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. అలాగే లివర్ క్యాన్సర్ అనేది జన్యు సంబంధ సమస్యలు లేదా వంశ పారంపర్య కారణాల వల్ల కూడా వచ్చే అవకాశాలు ఉంటాయి.

### తీసుకోవాల్సిన ఆహారాలు..

లివర్ క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ అయితే కచ్చితంగా చికిత్స తీసుకోవాలి. వ్యాధి ప్రారంభ దశలో ఉంటే లక్షణాలను ముందుగానే గుర్తిస్తే చికిత్స తీసుకుని ప్రాణాంతకం కాకుండా సురక్షితంగా ఉండవచ్చు. అయితే లివర్ క్యాన్సర్ వ్యాధి బారిన పడిన వారు లేదా వ్యాధి రావొద్దని కోరుకునే వారు, లివర్ సమస్యలు ఉన్నవారు ఆహారంలో మార్పులు చేసుకుంటే మంచిది. దీంతో వ్యాధి మరింత ముదరకుండా ఉంటుంది. వ్యాధి రాకుండా కూడా అడ్డుకోవచ్చు. కాఫీని రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే లివర్‌కు ఎంతో మేలు చేస్తుంది. లివర్ కణాలు డ్యామేజ్ అవకుండా కాఫీ రక్షిస్తుంది. కాఫీలో ఉండే సమ్మేళనాలు లివర్‌ను రక్షిస్తాయి. లివర్‌లో కొవ్వు చేరకుండా చూస్తాయి. లివర్ వాపులను తగ్గిస్తాయి. ఓట్‌మీల్ ను తీసుకోవడం వల్ల ఫైబర్ సమృద్ధిగా లభిస్తుంది. ఇది లివర్‌లోని కొవ్వును కరిగించి లివర్‌ను ఆరోగ్యంగా ఉంచుతుంది. అలాగే గ్రీన్ టీని కూడా రోజూ తాగవచ్చు. వెల్లుల్లిని ఆహారంలో భాగం చేసుకుంటున్నా మేలు జరుగుతుంది. బెర్రీలు, ద్రాక్ష, చేపలు, ఆకుకూరలు, బీట్ రూట్, పప్పు దినుసులు, తృణ ధాన్యాలను రోజూ తింటుంటే లివర్‌ను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. లివర్ క్యాన్సర్ నుంచి రక్షణ లభిస్తుంది.

# దూసుకెళ్తున్న అరట్టై.. నిజంగా ఇది వాట్సాప్ కిల్లర్ అవుతుందా!

ఇప్పుడు మెసేజ్‌లు చేయాలన్నా.. ఫోటోలు, వీడియోలు షేర్ చేయాలన్నా అందరూ వాడుతున్న యాప్ వాట్సాప్. మెట్రో సిటీల్లోని కార్పొరేట్ బిజినెస్‌ల నుంచి పల్లెటూళ్లలో పొలం పనులు చేసుకునే రైతన్నల దాకా వాట్సాప్‌నే వాడుతున్నారు. కానీ ఇప్పుడు ఈ వాట్సాప్‌నకు పోటీగా ఒక యాప్ విపరీతంగా క్రేజ్ తెచ్చుకుంటుంది. అదే 'అరట్టై యాప్'. కొద్దిరోజులుగా దీనికి యూత్‌లో విపరీతమైన క్రేజ్ వస్తోంది. అది ఎలా ఉందంటే.. రోజుకు 3వేల సైన్‌అప్స్ నుంచి ఒక్కసారిగా 3.5 లక్షలకు చేరింది. అంటే ఈ మెసేజింగ్ యాప్ ఇప్పుడు వంద రెట్ల వృద్ధి సాధించింది. అందుకే దీన్ని చాలామంది వాట్సాప్ కిల్లర్‌గా పిలుస్తున్నారు. మరీ యాప్‌నకు ఒక్కసారిగా ఎందుకింత క్రేజ్ వచ్చింది? ఈ యాప్ స్పెషాలిటీ ఏంటి ఇప్పుడు తెలుసుకుందాం..




### అసలు అరట్టై అంటే ఏంటి?

తిమిళంలో అరట్టై అంటే మాట్లాడుకోవడం అని అర్థం. వ్యక్తిగత మెసేజ్‌లతో పాటు గ్రూప్‌చాట్, ఆడియో, వీడియో కాల్స్ షేర్ చేసుకోవడం కోసం ఈ యాప్‌ను తీసుకొచ్చారు. జోహో కార్పొరేషన్ ఈ యాప్‌ను రూపొందించింది. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానం ఉపయోగించుకుని ఈ యాప్‌ను తయారుచేశారు.

### ఒక్కసారిగా ఎందుకు క్రేజ్ వచ్చింది?


నిజానికి ఈ యాప్ 2021లోనే విడుదలైంది. కానీ రీసెంట్‌గా ఈ యాప్‌నకు విపరీతమైన క్రేజ్ వచ్చింది. దీనికి స్వదేశీ పరిజ్ఞానాన్ని ప్రోత్సహించాలని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పిలుపునివ్వడం ఒక కారణంగా చెప్పొచ్చు. స్వదేశీ డిజిటల్ సొల్యూషన్స్‌ను వాడాలని ఆయన పిలుపునిచ్చిన తర్వాత క్రేజ్ వచ్చిన యాప్‌ల్లో అరట్టైనే నంబర్‌వన్ పొజిషన్‌లోకి వచ్చింది. ఈ యాప్ సోషల్‌మీడియాలోనూ తెగ వైరల్‌గా మారింది. దీంతో కేవలం మూడు రోజుల్లోనే ఈ యాప్‌లో సైన్‌అప్ అయ్యే యూజర్ల సంఖ్యలో 100 శాతం వృద్ధి వచ్చింది. అంతకుముందు రోజుకు 3వేల సైన్‌అప్‌లు ఉండగా.. ఆ తర్వాత 3.5లక్షలకు చేరింది. ఈ విషయాన్ని అరట్టై యాప్ కో ఫౌండర్ శ్రీధర్ వెంబు స్వయంగా తన ట్విట్టర్(ఎక్స్) ఖాతాలో వెల్లడించారు. ఈ గ్రోత్ మరో 100 రెట్లు పెరిగినా సరే సరిపోయేలా సర్వర్లను ఎక్స్‌పాండ్ చేస్తున్నామని తెలిపారు.

### ఈ యాప్ ఫీచర్స్ ఏంటి?

వాట్సాప్ యాప్‌తో పోలిస్తే అరట్టైలో కొత్త ఫీచర్లు ఏమీ లేవు. కాకపోతే యూజర్లకు కావాల్సిన ప్రధాన ఫీచర్లు అయినా టెక్స్ట్, మీడియా ఫైల్ షేరింగ్ ఆప్షన్స్ ఉన్నాయి. అలాగే ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్‌తో ఆడియో, వీడియో కాల్స్ చేసుకునే సదుపాయం కలదు. స్టోరీస్ కూడా పోస్టు చేసుకోవచ్చు. ఒకేసారి ఒకటి కంటే ఎక్కువ డివైజ్‌లలో దీన్ని లాగిన్ చేసుకోవచ్చు. డెస్క్‌టాప్ యాప్స్, ఆండ్రాయిడ్ టీవీ ఇంటిగ్రేషన్ కలదు. ఇక యాప్ క్రియేటర్స్‌కు, బిజినెస్ కంపెనీలకు మంచి ఉపయోగకరమనే చెప్పొచ్చు. తమ ఛానళ్ల ద్వారా అప్‌డేట్స్ షేర్ చేసుకునే అవకాశం ఈ యాప్‌లో కల్పించారు. ఈ యాప్‌కు మొగ్గు చూపడానికి మరో కారణం ప్రైవసీ. ఇందులో యూజర్ డేటాను మానిటైజ్ చేయబోమని జోహో కంపెనీ చెప్పడం యూజర్లను తెగ ఆకట్టుకుంటుంది.

### వాట్సాప్‌నకు ప్రత్యామ్నాయం అవుతుందా?

అరట్టై యాప్‌నకు వస్తున్న క్రేజ్ చూసి చాలామంది దీన్ని వాట్సాప్ కిల్లర్‌గా పిలుస్తున్నారు. కానీ 500 మిలియన్‌లకు పైగా యూజర్లు ఉన్న వాట్సాప్‌నకు అరట్టై ఛాలెంజ్ ఇవ్వడం అంత సులువైన విషయం కాదని టెక్ నిపుణులు చెబుతున్నారు. రీసెంట్‌గా ఈ యాప్‌నకు పెరుగుతున్న యూజర్లతో సర్వర్లు మెయింటైన్ చేయడమే ఈ జోహో కంపెనీకి కష్టంగా మారింది. దీనివల్ల ఓటీపీలు ఆలస్యంగా రావడం, కాంటాక్ట్‌లు సింకింగ్ కాకపోవడం, కాల్ ఫెయిల్యూర్ వంటి సమస్యలు ఎదురయ్యాయి. దీన్ని జోహో కూడా అంగీకరించింది. ఆ సమస్యలను రెండు రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపింది. ఇక అరట్టై యాప్‌ను కొత్త ఫీచర్లతో నవంబర్‌లో మళ్లీ రిలీజ్ చేయాలని అనుకుంది. కానీ ఇప్పుడొచ్చిన బూమ్‌తో సర్వర్లను బలోపేతం చేయడంపైనే కంపెనీ దృష్టిసారించింది. ఈ సమస్యలు అన్నింటినీ పరిష్కరించి, ఎప్పటికప్పుడు అప్‌డేట్లు, కొత్త ఫీచర్లు చేర్చుకుంటూ వెళ్తే కచ్చితంగా వాట్సాప్‌నకు ప్రత్యామ్నాయంగా మారే అవకాశం ఉందని టెక్ నిపుణులు చెబుతున్నారు.







## పశ్చిమాసియా ఘర్షణలు
## చర్చల ద్వారా శాంతి నెలకొల్పాలి : మోడీ



న్యూఢిల్లీ : పశ్చిమాసియా ఘర్షణలు వాణిజ్యానికి, ఇంధన సరఫరాలకు అంతరాయం కలిగిస్తుంది. ఈ నేపథ్యంలో గల్ఫ్‌లోని లక్షలాది మంది భారతీయుల భద్రత నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా శాంతి, సంభాషణలను ప్రోత్సహించేందుకు ఐక్యంగా గళం విప్పాలని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు. పశ్చిమాసియా పరిస్థితులపై నేడు ప్రధాని మోడీ రాజ్యసభలో మాట్లాడుతూ.. పశ్చిమాసియాలో యుద్ధం మొదలై.. మూడు వారాలు దాటింది. ఈ యుద్ధం వల్ల తీవ్రమైన ఇంధన సంక్షోభం ఏర్పడింది. భారతదేశానికి కూడా ఈ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. యుద్ధం మన వాణిజ్య మార్గాలపై ప్రభావం చూపింది. పెట్రోల్, డీజిల్, గ్యాస్, ఎరువుల సాధారణ సరఫరాకు అంతరాయమేర్పడింది అని అన్నారు. కాగా, సుమారు కోటిమంది గల్ఫ్ దేశాలలో నివసిస్తూ పనిచేస్తున్నారు. వారి ప్రాణాలకు జీవనోపాధికి భద్రత కల్పించడం భారత్‌కి ఆందోళన కలిగించే విషయం. హర్మోజ్‌లో ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలకు చెందిన నౌలు చిక్కుకుపోయాయి. వాటిల్లో పెద్ద సంఖ్యలో భారతీయ నౌకలు, సిబ్బంది ఉండడం ఆందోళన కలిగించే విషయం. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో భారత పార్లమెంటు ఎగువ సభ అయిన రాజ్యసభ నుండి శాంతి, సంప్రదింపుల కోసం ఐక్య స్వరం యావత్ ప్రపంచానికి వినిపించడం ఆవశ్యకం. యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి నేను పశ్చిమాసియాలోని చాలా దేశాల అధినేతలతో రెండు విడతలుగా ఫోన్ సంభాషణలు జరిపాను. మేము అన్ని గల్ఫ్ దేశాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాము. అలాగే ఇరాన్, ఇజ్రాయిల్, అమెరికాతో కూడా సంబంధాలు కొనసాగిస్తున్నాము అని అన్నారు. పశ్చిమాసియా సంఘర్షణల సమయంలో భారతదేశం తన పౌరుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తోంది. ఇప్పటివరకు ఇరాన్ నుండి వెయ్యిమందికి పైగా భారత్‌కు సురక్షితంగా తిరిగి వచ్చారు. వీరిలో 700 మంది మెడిసిన్ విద్యార్థులున్నారు. మొత్తంగా 3,75,000 మందికిపైగా భారతీయులు స్వదేశానికి వచ్చారు అని మోడీ అన్నారు. యుద్ధ పరిస్థితుల్లో కూడా దేశ నౌకల్ని సురక్షితంగా తెచ్చేందుకే భారత్ ప్రయత్నిస్తోంది. ఈ సమస్యను పరిష్కరించడానికి భారత్ చర్చల ద్వారా పరిష్కారాన్ని ఎంచుకుంది అని మోడీ చెప్పారు.

## హిందువులు, బౌద్ధులు, సిక్కులు మాత్రమే ఎస్‌సి హోదాకు అర్హులు



న్యూఢిల్లీ : హిందువులు, బౌద్ధులు, సిక్కులు మాత్రమే ఎస్‌సి హోదాను పొందగలరన్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు మంగళవారం సమర్థించింది. క్రైస్తవ మతం సహా ఒక వ్యక్తి ఏ మతంలోకి మారినా, ఎస్‌సి కమ్యూనిటీ సభ్యులకు లభించే ప్రయోజనాలను పొందలేరని పేర్కొంది. "హిందూ మతం కాకుండా వేరే మతాన్ని అనుసరించే ఏ వ్యక్తి కూడా షెడ్యూల్డ్ కులానికి చెందిన వ్యక్తిగా పరిగణించబడరు" అని నిర్దేశించే రాజ్యాంగ (షెడ్యూల్డ్ కులాలు) ఉత్తర్వు, 1950లోని క్లాజ్ 3ను జస్టిస్ పి.కె.మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం తీర్పులో ప్రస్తావించింది. ఈ నిబంధన కింద ఉన్న పరిమితి సంపూర్ణమైనదని పేర్కొంది. 1950లోని క్లాజ్ 3లో పేర్కొనబడని ఏ మతంలోకి అయినా ఎస్‌సి సభ్యుడు మారితే, అతను రిజర్వ్ కేటగిరీ హోదాను కోల్పోవడానికి దారితీస్తుందని కోర్టు పేర్కొంది. క్రైస్తవమతంలోకి మారిన ఎస్‌సి వ్యక్తి, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల (అత్యాచారాల నివారణ) చట్ట ఉల్లంఘన జరిగిందని వాదించలేరని తెలిపింది. క్రైస్తవమతంలోకి మారి, ప్రస్తుతం పాస్టర్‌గా వ్యవహరిస్తున్న ఒక వ్యక్తి, తనపై దాడికి పాల్పడ్డారంటూ కొంతమంది వ్యక్తులపై షెడ్యుల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల (అత్యాచారాల నివారణ ) చట్ట కింద దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ఈ ఉత్తర్వులిచ్చింది.ం

## అక్కడ నుంచే విజయ్ ఎన్నికల ప్రచారం?



చెన్నై: ఎన్నికల పనులను పర్యవేక్షించడం కోసం చెన్నైలోని పెరంబూర్ ప్రాంతంలో తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు విజయ్ ఓ బంగ్లాను కొనుగోలు చేసినట్లు సమాచారం. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ 23న ఒకే విడతలో జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో డీఎంకే కూటమి, ఏఐఏడీఎంకే కూటమి, నామ్ తమిళర్ కట్చి, తమిళగ వెట్రి కళగం మధ్య చతుర్ముఖ పోటీ నెలకొంది. మొదటిసారిగా ఎన్నికల బరిలోకి దిగుతున్న విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ ఒంటరిగానే బరిలోకి దిగుతోంది. ఇప్పటికే పుదుచ్చేరి అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించినప్పటికీ, తమిళనాడు అభ్యర్థుల జాబితాను ఇంకా విడుదల చేయలేదు. అయితే, చెన్నైలోని పెరంబూర్ నియోజకవర్గం నుంచి విజయ్ స్వయంగా పోటీ చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే, పెరంబూర్ పరిధిలోని కొడుంగయ్యూర్ సమీపంలోని కన్నదాసన్ నగర్‌లో విజయ్ ఓ బంగ్లాను సొంతంగా కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఎన్నికల ప్రచార సమయంలో ఈ బంగ్లాలోనే ఉండి పనులు పర్యవేక్షించాలని విజయ్ భావిస్తున్నారని.. రేపు ఉదయం(బుధవారం) ఈ బంగ్లాలో పూజా కార్యక్రమాలు జరగనున్నాయని సమాచారం. తమిళనాడులో ఏప్రిల్ 23న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుండగా, ఈ నెల 30 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతోంది. మే 4న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

## యుద్ధం వల్ల భారత్‌కు ఈ సవాళ్లు ఎదురయ్యాయి



ఢిల్లీ: పశ్చిమాసియాలో యుద్ధం వేళ చోటుచేసుకున్న పరిస్థితులపై ఇవాళ రాజ్యసభలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. చర్చలు, దౌత్యం ద్వారానే ఇరాన్ యుద్ధానికి పరిష్కారమని, ఉద్రిక్తత తగ్గించేందుకు భారత్ ప్రయత్నాలు చేసిందని అన్నారు. దేశం ఐక్యంగా ఉంటే ఏ సవాలునైనా ఎదుర్కోగలమని తెలిపారు. 'యుద్ధంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడింది. భారత్‌కు ఆర్థిక, భద్రత, మానవతా సవాళ్లు ఎదురయ్యాయి. గల్ఫ్ దేశాల్లో దాదాపు కోటి మంది భారతీయులు ఉన్నారు. వారి భద్రతకు కేంద్రం ప్రాధాన్యం ఇచ్చింది. ఇప్పటివరకు 3.75 లక్షల భారతీయులు స్వదేశానికి తిరిగి వచ్చారు. ఇరాన్ నుంచి సుమారు 1,000 మంది భారతీయులను తరలించాం. అందులో 700 మందికి పైగా మెడికల్ విద్యార్థులు ఉన్నారు. విదేశాల్లోని భారత మిషన్లు 24/7 సహాయక చర్యల్లో పాల్గొన్నాయి. హెల్ప్‌లైన్‌లు, కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశాం. హోర్ముజ్ జలసంధిలో నౌకాయానం కష్టతరం. అయినప్పటికీ ఇంధన సరఫరా అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నాం. భారత్ వద్ద 53 లక్షల మెట్రిక్ టన్నుల చమురు నిల్వలు ఉన్నాయి. ప్రస్తుతం 41 దేశాల నుంచి ఇంధన దిగుమతులు జరుగుతున్నాయి. ఎల్పీజీలో దేశీయ వినియోగానికి ప్రాధాన్యం ఇస్తున్నాం. దేశీయ ఉత్పత్తి పెంపుపై దృష్టి పెట్టాం. ఇథనాల్ బ్లెండింగ్ వల్ల చమురు దిగుమతులు తగ్గిస్తున్నాం. రైల్వే విద్యుతీకరణతో డీజిల్ వినియోగం తగ్గిస్తున్నాం. ఎరువుల సరఫరా కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. విద్యుత్ డిమాండ్‌కు తగిన బొగ్గు నిల్వలు ఉన్నాయి. రిన్యూవబుల్ ఎనర్జీలో భారత్ పురోగతి సాధించింది. తప్పుడు ప్రచారం, బ్లాక్ మార్కెటింగ్ పై కఠిన చర్యలు తీసుకుంటాం. మనముందు చాలా సవాళ్లు ఉన్నాయి. భారత్ ఎప్పుడూ శాంతినే కోరుకుంటుంది. విదేశాల్లో ఉన్న భారతీయులందరి రక్షణకు చర్యలు తీసుకుంటున్నాం. గల్ఫ్ దేశాల్లోని భారతీయులు యుద్ధ సంక్షోభంలో చిక్కుకున్నారు' అని మోదీ చెప్పారు.

# ఎన్నికల బాజా!




ఈసారి ఏప్రిల్ అధిక ఉష్ణోగ్రతలతోపాటు ఎన్నికల వేడిని కూడా చవిచూడబోతోంది. నాలుగు రాష్ట్రాలు-- తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, అస్సాంలతోపాటు కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో కూడా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించబోతున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) ఆదివారం ప్రకటించింది. బెంగాల్‌లో రెండు దఫాలుగా ఏప్రిల్ 23, 29ల్లో పోలింగ్ జరగనుండగా, మిగిలినచోట్ల 9న ఒకే దఫాతో ముగుస్తుంది. అన్నింటి ఫలితాలూ మే 4న వెలువడతాయి. 2006 నుంచి చూస్తే వేలంపాట మాదిరి అయిదు నుంచి ఎనిమిది దఫాలుగా పోలింగ్ సాగిన చరిత్రగల బెంగాల్‌లో ఈసారి కేవలం రెండు దఫాలతో సరిపెట్టారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పేరిట ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ జరిపి 60.06 లక్షల మంది ఓటర్లను త్రిశంకు స్వర్గంలో ఉంచిన ఈసీ... ఆ విషయం తేలకుండానే బెంగాల్ ఎన్నికలు నిర్వహించబోతోంది. ఆ విషయంలో వచ్చిన ఫిర్యాదులను హైకోర్టు మాజీ న్యాయమూర్తులతో ఏర్పడే అప్పిలేట్ ట్రిబ్యునళ్లు పరిష్కరించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇప్పటికే 705 మంది ఆ పనిలో ఉన్నారు. రోజుకు లక్ష ఫిర్యాదుల్ని పరిష్కరిస్తున్నారు. అలా చూసుకుంటే నామినేషన్ల ఘట్టం ముగిసే ఏప్రిల్ 9 నాటికి 39 లక్షలమంది వినతులు పరిష్కారమవుతాయి. వారిలో ఎందరికి ఓటేసే భాగ్యం దక్కుతుందోగానీ... ఎటూ తేలకుండా 20 లక్షల మందికిపైగా మిగిలిపోతారు. ఎందుకంటే, ప్రజాప్రాతినిధ్య చట్టం 23(3) ప్రకారం నామినేషన్ల గడువు ముగిశాక ఎన్నికల జాబితా మారకూడదు. అధికారంలో ఉండగా ఏం చేసినా, ఎన్నికల సీజన్ వచ్చేసరికి వాగ్దానాలు వరదలై పారటం మనకు రివాజైంది. అధికారంలో ఉన్న వెసులుబాటు ఉపయోగించుకుని ఏదో పథకం పేరిట మహిళా ఓటర్ల ఖాతాలకు డబ్బు పంపిణీ సంప్రదాయం నిరుడు నవంబర్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు బిహార్ ఎన్డీయే కూటమి మొదలెట్టింది. దానికింద 75 లక్షల మంది మహిళలకు రూ.10,000 చొప్పున పంపిణీ అయ్యాయి. దీనికి మలి దశ కూడా ఉంటుందని చెప్పడం మరింత లాభించింది. మహిళలంతా ఎన్డీయేకు నీరాజనాలు పట్టారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ కూడా ఆ బాటలోనే 1.31 కోట్లమంది మహిళల ఖాతాలకు రూ. 5,000 చొప్పున గత నెలలో బదిలీ చేశారు. ఇవిగాక రాబోయే రోజుల్లో పార్టీలు విడుదల చేయబోయే మేనిఫెస్టోల నిండా ఎటూ ఉచితాల మోత మోగుతుంది. ఎన్నికలు జరగబోయే రాష్ట్రాల్లో ఒక్క అస్సాంలో తప్ప మరెక్కడా బీజేపీ అధికారంలో లేదు. పుదుచ్చేరిలో మాత్రం ప్రాంతీయ పక్షం ఎన్నార్ కాంగ్రెస్ ఆధ్వర్యంలోని అధికార కూటమిలో భాగస్వామిగా ఉంది. ఓట్ల శాతం క్రమేపీ పెరుగుతూ వస్తున్న బెంగాల్‌లో ఈసారి నిర్ణయాత్మక పాత్ర పోషించగలమని ఆ పార్టీ విశ్వసిస్తోంది. కానీ వచ్చిన ఏ అవకాశాన్నయినా అంత తేలిగ్గా వదలని తృణమూల్ అధినేత, సీఎం మమతా బెనర్జీ ముందు ఎవరి ఎత్తుగడలైనా ఫలించటం అంత తేలిక కాదు. సినీ నటుడు విజయ్ కొత్తగా ప్రారంభించిన టీవీకే పార్టీతో పొత్తు ఖరారైతే తమిళనాడు తమ జోలెలో పడుతుందని బీజేపీ ఆశిస్తోంది. మిత్రపక్షం అన్నా డీఎంకేపై పెద్దగా ఆశలేమీ లేవు. స్టాలిన్ నాయకత్వంలోని డీఎంకేను ఢీకొనడం కష్టమే. కేరళలో వరసగా పదేళ్లు సీపీఎం నాయకత్వంలోని ఎల్‌డీఎఫ్ ఏలుబడి సాగింది గనుక అక్కడ కాంగ్రెస్ కూటమి యూడీఎఫ్‌లో బాగా ఆశలున్నాయి. 2014 నుంచి వరసగా అధికారంలోకొస్తున్న అస్సాంలో బీజేపీ ఎంతో ఆత్మవిశ్వాసంతో ఉంది. 2023 నాటి నియోజకవర్గాల పునర్విభజనతో ముస్లిం ప్రాతినిధ్యం ఉండే స్థానాలు 23కి పడిపోవడం, మొన్నటి బడ్జెట్‌లో మహిళలకూ, యువతకూ ప్రకటించిన రూ. 5,000 కోట్ల ఆర్థిక లబ్ధి చేకూర్చే పథకాలు ఆ ఆత్మవిశ్వాసానికి మూలం. కాంగ్రెస్ సంస్థాగత బలహీనతలు సరేసరి. ఈ ఎన్నికలు ఈసీ విశ్వసనీయతకు కూడా పరీక్ష. లోక్‌సభలో అభిశంసన తీర్మానం ఎదుర్కొనబోతున్న తరుణంలో ఈసారైనా తటస్థత పాటిస్తుందని అందరూ ఆశిస్తున్న తరుణంలో బెంగాల్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శినీ, హోం కార్యదర్శినీ మార్చింది. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల విషయంలో వచ్చిన ఫిర్యాదులపై రెండేళ్లు దాటుతున్నా నిమ్మకు నీరెత్తినట్టున్న ఆ సంస్థ వైఖరి ఈ ఎన్నికల విషయంలో మారకపోతే మరిన్ని ఛీత్కారాలు తప్పవు. మొత్తానికి ఏ పార్టీ జాతకం ఏమిటో తెలియడానికి మే నాలుగో తేదీ వరకూ ఆగక తప్పదు.

# డ్రగ్స్ మాఫియా అరాచకం




హైదరాబాద్ శివారులో ఒక పెద్ద ఫాంహౌస్... అక్కడొక ఈత కొలను...దాని పక్కనే ఆశీనులైన బడాబాబులు... ముందున్న టేబుళ్లపై ఖరీదైన మద్యం సీసాలు, మాదక ద్రవ్యాలు... జర్మన్ తయారీ రివాల్వర్‌తో పోలీసులపై కాల్పులు, బెదిరింపులు, వాగ్వాదాలు-- క్రైమ్ కథాచిత్రాన్ని తలదన్నే శనివారం నాటి ఈ దృశ్యం మూలాలు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయంటే కించిత్తు ఆశ్చర్యం కలుగుతుంది. మొన్న జనవరిలో కూటమి ప్రభుత్వ భాగస్వామ్య పక్షమైన బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి కుమారుడు సుధీర్ రెడ్డి పట్టుబడితే, తాజాగా ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్‌తోపాటు మరికొందరు దొరికిన వైనం దీన్ని రుజువు చేస్తోంది. వేయి తలల విషనాగు లాంటి మాదక ద్రవ్య మహమ్మారి ఆనుపానులు రాబట్టడానికి, దాన్ని అంతమొందించటానికి పోలీసులు నానా తంటాలూ పడుతున్నారు. కానీ బడి పిల్లలు మొదలుకొని ఆడ మగ తేడా లేకుండా అందరినీ కాటేస్తున్న ఈ విషనాగు వెనక రాజకీయ పలుకుబడి గల కుటుంబాలున్నాయనీ, కనుకనే దాని అదుపు అసాధ్యమవుతున్నదనీ ఈ పరిణామాలు తెలియజెబుతున్నాయి. ఒకరా ఇద్దరా... తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి, రాజస్థాన్ మాజీ ఎమ్మెల్యే నితీశ్ శర్మ, ఢిల్లీకి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి నమిత్ శర్మ వగైరా 11 మంది ఈ డ్రగ్స్ దందాలో దొరికారు. రెండేళ్ల నాడు ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో కూటమి నేతల ప్రసంగాలను గుర్తుంచుకుని ఇప్పుడు వెల్లడవుతున్న పరిణామాలతో బేరీజు వేసుకుంటే ఆ నేతల వంచన ఏపాటిదో అర్థమవుతుంది. మాదక ద్రవ్యాలకు ఆంధ్రప్రదేశ్ అడ్డాగా మారిందంటూ వారు పెడబొబ్బలు పెట్టారు. 'మేం వస్తే వంద రోజుల్లో అరికడతామ'ంటూ ప్రగల్భాలు పలికారు. కానీ అధికారంలోకొచ్చాక అంతవరకూ సాధించిన విజయాలను గుల్లచేశారు. అది మళ్లీ తలెత్తి విస్తరించటానికి అవకాశమిచ్చారు. అప్పటి దుష్ప్రచారమంతా గెలుపు కోసం మాత్రమే కాదు... మాదక ద్రవ్యాలను అరికట్టడం వల్ల కలుగుతున్న నష్టాన్ని పూడ్చుకోవడం కోసమని ఆ కూటమి పీఠం ఎక్కింది మొదలు జరుగుతున్న ఉదంతాలు వెల్లడిస్తున్నాయి. చంద్రబాబు అధికారంలోకి వచ్చినప్పటినుంచీ ఇసుక మాఫియా, మద్యం మాఫియా, డ్రగ్స్ మాఫియా విచ్చలవిడిగా చెలరేగుతున్నాయి. 'గంజాయి వద్దు బ్రో...' అంటూనే మాదక ద్రవ్యాలకు తలుపులు బార్లా తెరిచారు. ఏపీలో మాదక ద్రవ్య చీడను అంతమొందించటానికి గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఆపరేషన్ పరివర్తన్‌ను రెండు దశల్లో విజయవంతంగా అమలు చేసింది. దానికితోడు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్)ను ఏర్పాటు చేసింది. ఆంధ్ర--ఒడిశా సరిహద్దు (ఏఓబీ)లో ఉండే 11,500 ఎకరాల్లోని గంజాయి సాగును ధ్వంసం చేయడంతోపాటు, గిరిజనులు ఇతర పంటల వైపు మళ్లేలా రూ. 500 కోట్లతో ప్రోత్సాహకాలందించింది. విస్తృత తనిఖీలు చేపట్టింది. ఈ కృషినంతా కూటమి పాలన నీరుగార్చింది. పర్యవసానంగా విద్యాసంస్థల్లో చిల్లరగా... ఫామ్‌హౌస్ పార్టీలకు టోకుగా గంజాయి, కొకైన్, ఎల్‌ఎస్‌డీ, ఎండీఎంఏ వగైరాలు చేరిపోతున్నాయి. ఏడాదికి రూ.5,000 కోట్లు వెనకేసుకోవడమే లక్ష్యంగా సాగుతున్న ఈ దందాకు మూలవిరాట్టులు చంద్రబాబు చుట్టూ ఉండే సీనియర్ నేతల కుటుంబాలవారు కావటంతో ఏపీ పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. మాదక ద్రవ్యాల వ్యాప్తిపై వెల్లడవుతున్న గణాంకాలు విస్తుగొలుపుతున్నాయి. నిరుడు దేశవ్యాప్తంగా భద్రతా విభాగాలకు రూ. 25,330 కోట్ల విలువైన డ్రగ్స్ పట్టుబడ్డాయి. అంతక్రితంతో పోలిస్తే ఇది 55 శాతం కన్నా అధికం. ఏపీలో వీటికి అలవాటుపడిన వారిలో 10--17 ఏళ్ల మధ్య గలవారి సంఖ్య 3.19 లక్షలు ఉన్నట్టు చెబుతున్నారు. వీటి వెనక డబ్బాశ మాత్రమే కాదు, దాని ఆసరాతో రాజకీయాలను శాసించటం అసలు లక్ష్యం. మాదక ద్రవ్యాల నియంత్రణ విషయంలో తెలంగాణ పోలీసులకు అంతో ఇంతో మంచి పేరుంది. కానీ తాజా కేసు తీవ్రత తెలిసి కూడా, నిందితుడిగా ఉండాల్సిన వ్యక్తికి స్టేషన్ బెయిల్ ఇచ్చి ఆ ప్రతిష్ఠకు మచ్చ తెచ్చుకున్నారు. రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా వ్యవహరిస్తేనే ఉగ్రవాదాన్ని మించిన ఈ మహమ్మారి దుంపనాశనం సాధ్యం.

# ఇరాన్ ఊబిలో ట్రంప్!



ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాల దురాక్రమణ యుద్ధం పద్దెనిమిదో రోజుకు చేరుకున్నా ఆ రెండు దేశాలకూ దారీతెన్నూ తోచడం లేదు. మంగళవారం కీలకమైన ఇద్దరు ఇరాన్ నేతలు అలీ లారిజానీ, సులేమానీలనూ, బుధవారం మరో అగ్రశ్రేణి నేత ఇస్మాయిల్ ఖతీబ్‌నూ హతమార్చామని అమెరికా, ఇజ్రాయెల్ ఘనంగా చెప్పుకున్నా ఈ పరిణామాల తక్షణ ప్రభావం పెద్దగా లేదని ఇరాన్ సాగిస్తున్న ప్రతిదాడులే నిరూపిస్తున్నాయి. యుద్ధకాలంలో ఎవరి ఆదేశాల కోసమూ ఎదురుచూడకుండా ఏయే దశల్లో ఎలా స్పందించాలో దేశం నలుమూలలా మోహరించి ఉన్న సైనిక దళాలకు ముందే నిర్దేశించి ఉండటం ఇందుకు కారణం. యుద్ధరంగంలో సాధిస్తున్న విజయాల గురించి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఏం చెప్పుకుంటున్నా ఆయనకు ప్రతికూలతలే ఎదురవుతున్నాయని మంగళవారం నాటి రెండు పరిణామాలు చాటుతున్నాయి. హోర్ముజ్ జలసంధి విముక్తికి యుద్ధ నౌకలతో, విమానాలతో తరలి రావాలన్న ట్రంప్ పిలుపును నాటో దేశాలు తిరస్కరించాయి. 'మీ యుద్ధంతో మాకేమిటి సంబంధమ'ంటూ ఎదురు ప్రశ్నించాయి. దానికితోడు అమెరికా జాతీయ ఉగ్రవాద వ్యతిరేక కేంద్రం (ఎన్‌సీటీసీ) చీఫ్ జో కెంట్ తన పదవికి రాజీనామా చేశారు. అమెరికా భద్రతకు ఏమాత్రం ముప్పులేని ఇరాన్‌పై యుద్ధం ప్రకటించటం అనైతికమని ఆయన ప్రకటించారు. జో కెంట్ మొదటి నుంచీ ట్రంప్‌కు గట్టి మద్దతుదారు. 'మాగా' ఉద్యమ సూత్రధారుల్లో ఒకరు. ట్రంప్ చుట్టూ చేరిన పాలనా వ్యవస్థలోని ఇజ్రాయెల్ అనుకూలురు, ప్రధాన మీడియా ఆయన్ను పక్కదోవ పట్టించాయన్నది కెంట్ అభియోగం. ట్రంప్‌ది అమాయకత్వమా, మూర్ఖత్వమా అన్న సంగతలా ఉంచి అమెరికా అధ్యక్షులుగా ఎవరున్నా ఇజ్రాయెల్ మాటే చెల్లుబాటవుతున్నదని చరిత్ర చూస్తే తెలుస్తుంది. అయితే ప్రస్తుత యుద్ధం ఇజ్రాయెల్ కోసమే అయినా రెండు దేశాలూ సమాన స్థాయిలో ఇరాన్‌పై విరుచుకుపడుతున్నాయి. అమెరికా ఇంతవరకూ 7,000 లక్ష్యాలపై విరుచుకుపడగా, ఇజ్రాయెల్ 7,600 దాడులు చేసిందని సోమవారం అమెరికా సెంట్రల్ కమాండ్ లెక్కలు చెబుతున్నాయి. సైనికంగా ఇరాన్‌ను బలహీనపరచటం శక్తిమంతమైన అమెరికాకు పెద్ద కష్టం కాకపోవచ్చు. ఇరాన్ దగ్గరున్న డ్రోన్‌లూ, క్షిపణులూ కాలం గడుస్తున్నకొద్దీ తగ్గిపోవచ్చు. అదే పరిస్థితి కాస్త వెనకో ముందో ఇజ్రాయెల్, అమెరికాలకు కూడా ఎదురవుతుంది. కానీ దీర్ఘకాలం ఈ యుద్ధాన్ని సాగదీయటం ద్వారా అమెరికా ఆర్థిక వ్యవస్థనూ, ఆ తర్వాత ప్రపంచ ఆర్థిక వ్యవస్థనూ కోలుకోలేని విధంగా దెబ్బతీసే శక్తి ఇరాన్‌కుంది. గత నెల 24న జాతినుద్దేశించి ట్రంప్ ప్రసంగించినప్పుడు అందులో ఎక్కడా ఇరాన్ ప్రస్తావన లేదు. ఆకాశాన్నంటుతున్న గ్యాస్ ధరలు, ద్రవ్యోల్బణం గురించే ఆయన ఏకరువు పెట్టారు. ఇప్పుడు హోర్ముజ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధించటంతో అవి పట్టపగ్గాల్లేకుండా విజృంభిస్తున్నాయి. ముమ్ముందు మరింత ఉగ్రరూపం దాలుస్తాయి. అందుకే ట్రంప్ విజయాలేవీ అమెరికన్లను రంజింప జేయలేక పోతున్నాయి. కనుకనే అందరిపైనా ట్రంప్ ఆగ్రహావేశాలతో రగిలిపోతున్నారు. మాట వినని నాటో మాత్రమే కాదు... నిలదీస్తున్న రిపబ్లికన్లు, యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్న 'మాగా' ఉద్యమ కారులు ఆయన్ను కుదురుగా ఉండనీయటం లేదు. ఆయన చేస్తున్న పరస్పర విరుద్ధ ప్రకటనలే అందుకు రుజువు. తొలుత బ్రిటన్ సాయాన్ని అర్థించి, ఆ తర్వాత హోర్ముజ్ విముక్తికి సహకరించమని నాటోతోపాటు చైనాను కూడా వేడుకుని, వారంతా నిరాకరించాక ఇరాన్‌ను ఒంటరిగానే ఎదుర్కొంటామంటూ ఆర్భాటంగా ప్రకటించడం ఆయన మానసిక స్థితిని వెల్లడిస్తోంది. నాటోను కోరడంలో వింతేమీ లేదు. కానీ ఆర్థిక రంగంలో సవాలుగా మారిన చైనాను అర్థించటం ట్రంప్ బలహీనతను బయటపెడుతోంది. 2003 నాటి ఇరాక్ దురాక్రమణ అమెరికాను ఆర్థికంగా దెబ్బతీస్తే, ఆ మేరకు చైనా లాభపడింది. ఇప్పుడు సైతం చైనా అలాంటి అవకాశం కోసమే ఎదురుచూస్తుండగా, అది సాయ పడుతుందని ట్రంప్ ఎలా అనుకున్నారో అనూహ్యం. మొత్తానికి ఆయన ఇరాన్ అనే ఊబిలో దిగబడ్డారు. దాన్నుంచి బయటపడటం సులభమేం కాదు.

# సీతమ్మ ఎగ్జిట్ తో యామీ గౌతమ్ సీన్లోకి!



బాలీవుడ్ డైరెక్టర్ ఆనంద్ ఎల్ . రాయ్ ధనుష్, కృతి సనన్ జంటగా 'తేరే ఇష్క్ మే' చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఇదొక రొమాంటిక్ లవ్ స్టోరీ. ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. - ఆత్రాంగిరే - తర్వాత ధనుష్ తో ఆనంద్ తెరకెక్కిస్తోన్న మరో చిత్రం కావడంతో? ఈరేంజ్ బజ్ క్రియేట్ అవుతోంది. - గుడ్ లక్ జెర్రీ -, -% రక్షాబంధన్ - లాంటి సినిమాల వైఫల్యం తర్వాత ఆనంద్ ఎల్ . రాయ్ నుంచి రిలీజ్ అవుతోన్న చిత్రమిది. దీంతో ఈ సినిమాతో ఎలాగైనా కంబ్యాక్ అవ్వాలని గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. అందుకు తగ్గట్టే మార్కెట్లో బజ్ నెలకొంది. కాగా ఈ సినిమా సెట్స్ ఉండగానే ఆనంద్ మరో ప్రాజెక్ట్ కూడా సెట్ చేస్తున్నారు. - నయి నవేలీ - అనే చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు బాలీవుడ్ మీడియాలో జోరుగా చర్చ సాగుతోంది. భారతీయ జానపద కథలతో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన హారర్ కామెడీ కథగా తెలుస్తోంది. ఇందులో హీరోయిన్ గా కృతిసనన్ ఎంపికైంది. తేరే ఇష్క్ మే%-%లో కృతి పెర్ఫార్మెన్స్ చూసి మరోసారి హీరోయిన్ ఛాన్స్ తనకే ఇచ్చాడు ఆనంద్. అయితే ఇప్పుడా ప్రాజెక్ట్ నుంచి కృతిసనన్ అనూహ్యంగా తప్పుకుంది. ఆమె ఎందుకు ఎగ్జిట్ అయిందన్నది తెలియదు గానీ ..మరో ఆలోచన లేకుండా రాయ్ అదే పాత్రకు యామీ గౌతమ్ ని ఎంపిక చేసారు. కృతి కంటే ఇప్పుడా పాత్రకు యామీ పర్ఫెక్ట్ గా సూటవుతుందని చిత్ర వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. దీంతో కృతిసనన్-ఆనంద్ ఎల్ రాయ్ మధ్య క్రియేటివ్ డిఫరెన్సెస్ ఏవైనా తలెత్తాయా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరి అసలు కారణం ఏంటి? అన్నది తెలియాలి. ఈ ఏడాది చివరి నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు పెట్టాలని రాయ్ టీమ్ ప్లాన్ చేస్తోంది. ఇంతలోనే కృతి సనన్ తప్పుకోవడం..ఆమె స్థానంలోకి యామీ గౌతమ్ రావడం అంతా వేగంగా జరిగిపోయాయి. ప్రస్తుతం యామీ సక్సెస్ పరంగా మంచి స్వింగ్ లో ఉంది. %-%ఆర్టికల్ 370%-, -%ఓఎమ్ జీ 2%-% లాంటి శక్తివంతమైన కథలతో ప్రేక్షకుల్ని అలరించింది. త్వరలో - హక్ - అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇంతలోనే ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వంలో నటించే అరుదైన అవకాశం ఒడిసి పట్టుకుంది.

# పూరీ 'స్లమ్ డాగ్'.. రిలీజ్ కు ఇబ్బందులు తప్పవా?





స్టార్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రం ప్రస్తుతం టాలీవుడ్ లో చర్చనీయాంశంగా మారింది. కోలీవుడ్ స్టార్ యాక్టర్ విజయ్ సేతుపతి హీరోగా నటిస్తున్న ఆ సినిమాలో సంయుక్త మీనన్ హీరోయిన్ గా కనిపించనున్నారు. కీలక పాత్రల్లో టబు, దునియా విజయ్ కుమార్ నటిస్తున్నారు. రీసెంట్ గా ఆ మూవీకి స్లమ్ డాగ్ 33 టెంపుల్ రోడ్ అనే టైటిల్ ను ఫిక్స్ చేసిన విషయం తెలిసిందే. జనవరిలో విజయ్ సేతుపతి పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ టైటిల్ ను రివీల్ చేస్తూ.. విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ సినిమాపై ఆసక్తి పెంచింది. పోస్టర్ లో ఆయన బిచ్చగాడి గెటప్ లో కనిపిస్తూ.. చేతిలో రక్తంతో తడిసిన కత్తి పట్టుకుని పవర్ ఫుల్ లుక్ లో మెప్పించారు. చుట్టూ చెల్లాచెదురుగా పడి ఉన్న డబ్బు కట్టలు కథలోని ఇంటెన్సిటీ సూచిస్తున్నాయి. సినిమాను పూరీ కనెక్ట్స్ బ్యానర్ పై పూరీ జగన్నాథ్ తో కలిసి చార్మీ కౌర్ నిర్మిస్తున్నారు. జేబీ మోషన్ పిక్చర్స్ తరఫున జేబీ నారాయణరావు నిర్మాణంలో భాగమయ్యారు. సంగీతాన్ని హర్షవర్ధన్ రామేశ్వర్ అందిస్తున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో చిత్రాన్ని విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నారు. ప్రత్యేకంగా చెప్పాల్సిన విషయం ఏమిటంటే.. షూటింగ్ ను కేవలం ఐదు నెలల్లో పూర్తి చేశారు. అయితే సినిమా విడుదలకు ముందు కొన్ని ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందనే వార్తలు వినిపిస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం పూరీ జగన్నాథ్ దర్శకత్వం వహించిన గత చిత్రం లైగర్ చుట్టూ ఉన్న ఆర్థిక వివాదాలే. ఆ సినిమా వల్ల కొంతమంది డిస్ట్రిబ్యూటర్లకు నష్టాలు వచ్చాయని, వారికి చెల్లించాల్సిన బకాయిలు ఇంకా పెండింగ్ లో ఉన్నాయని టాక్ ఉంది. ఇక తర్వాత వచ్చిన డబుల్ ఐస్మార్ట్ సినిమా సమయంలో, బకాయిల్లో కొంత మొత్తం చెల్లించి, మిగిలిన దాన్ని సినిమా విడుదల తర్వాత చెల్లిస్తానని పూరీ మాటిచ్చారని సమాచారం. అయితే ఆ హామీ పూర్తిగా నిలబెట్టుకోలేదని ఇండస్ట్రీలో ప్రచారం జరుగుతోంది. దీంతో కొందరు పంపిణీదారులు బకాయిలు క్లియర్ అయ్యేవరకు పూరీ జగన్నాథ్ సినిమాలు రిలీజ్ చేయనివ్వకూడదని వారు నిర్ణయించుకున్నారనే టాక్ వినిపిస్తోంది. ఇదే కారణంగా గతంలో విడుదలకు సిద్ధమైన పోకిరి రీ రిలీజ్ నిలిచిపోయిందని సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో స్లమ్ డాగ్ సినిమా విడుదల సమయంలో ఏం జరుగతుందోన్న ప్రశ్న ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది. సినిమా షూటింగ్ పూర్తి అయినప్పటికీ, ఫైనాన్షియల్ క్లియరెన్స్ లేకపోతే రిలీజ్ ఆలస్యమయ్యే అవకాశాలు ఉన్నాయని టాక్. ఏదేమైనా కంటెంట్ పరంగా ఆసక్తి రేకెత్తిస్తున్న ఆ సినిమా,, విడుదల సమయంలో ఆర్థిక సమస్యలను ఎలా అధిగమిస్తుందన్నది చూడాల్సి ఉంది. ప్రేక్షకులు మాత్రం విజయ్ సేతుపతి- పూరీ జగన్నాథ్ కాంబినేషన్ పై మంచి అంచనాలు పెట్టుకున్నారు.



# చీరకట్టుతో చెమటలు పట్టిస్తున్న బేబమ్మ.. ఇంత సోయగాన్ని ఎలా మిస్ అయ్యాం?



కన్నడ బ్యూటీగా పేరు సొంతం చేసుకున్న కృతి శెట్టి తొలిసారి.. డైరెక్టర్ సుకుమార్ శిష్యుడు బుచ్చిబాబు సన దర్శకుడిగా మారి తొలి ప్రయత్నంలో చేసిన 'ఉప్పెన' సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది. ఈ సినిమాలో బేబమ్మ పాత్రలో నటించి తన అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంది కృతి శెట్టి. మెగా మేనల్లుడు వైష్ణవ్ తేజ్ హీరోగా, కృతి శెట్టి హీరోయిన్గా వచ్చిన ఈ సినిమా అతి తక్కువ సమయంలోనే 100కోట్ల క్లబ్లో చేరి సంచలనం సృష్టించింది. ఇద్దరికీ ఇది తొలి చిత్రమైనా.. తమ నటనతో ఊహించని పాపులారిటీ సొంతం చేసుకున్నారు. ఈ సినిమా తర్వాత నానితో శ్యామ్ సింగరాయ్, నాగచైతన్యతో బంగార్రాజు వంటి చిత్రాలు చేసి హ్యాట్రిక్ సొంతం చేసుకుంది. ఇండస్ట్రీలోకి వచ్చిన మొదట్లోనే హ్యాట్రిక్ అందుకున్న హీరోయిన్గా కూడా రికార్డు సృష్టించింది కృతి శెట్టి. ఆ తర్వాత పలు సినిమాలలో అవకాశాలు లభించాయి. కానీ వాటిని సద్వినియోగం చేసుకోవడంలో విఫలమయింది. అందులో భాగంగానే వరుస పరాజయాలు తలుపు తట్టడంతో కొంతకాలం ఇండస్ట్రీకి కూడా దూరమైంది ఇప్పుడిప్పుడే మళ్లీ తనను తాను కం బ్యాక్ చేసుకోవాలని చూస్తున్న కృతి శెట్టి.. ఇటు సోషల్ మీడియాలో గ్లామర్ ఫోటోలతో ప్రేక్షకులను అలరిస్తోంది. మొదట్లో పద్ధతిగా కనిపించి, ఆ తర్వాత గ్లామర్ డోస్ పెంచిన ఈమె తన అందాలను హైలెట్ చేస్తూ ఫోటోలకు ఫోజులిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈసారి ఏకంగా చీరకట్టుతోనే చూసే ఆడియన్స్ కు చెమటలు పట్టించేసింది కృతి శెట్టి. తాజాగా ఇన్స్టాగ్రామ్ వేదికగా షేర్ చేసిన ఈ ఫోటోలు చూసి అభిమానులు ఇన్ని రోజులు ఇంత అందాన్ని ఎలా మిస్ అయ్యాం అంటూ కామెంట్లు చేస్తున్నారు. శారీ విషయానికి వస్తే.. ఎంబ్రాయిడరీ నెట్టెడ్ లైట్ ఆరెంజ్ కలర్ తో డిజైన్ చేసిన చీరను కట్టుకొని , అందుకు కాంబినేషన్లో స్లీవ్ లెస్ బ్లౌజ్ ధరించింది. ఫ్రంట్ డీప్ వీ నెక్ తో డిజైన్ చేసిన బ్లౌజ్ లో తన ఎద అందాలను హైలెట్ చేస్తూ ఫోటోలకు ఫోజులిచ్చింది. ముఖ్యంగా జుట్టును వదులుగా వదిలేసి సింపుల్ జువెలరీ తో తన మేకోవర్ ను ఫినిష్ చేసింది. ఇందులో నడుము, ఎద అందాలను హైలెట్ చేస్తూ ఫోటోలకు ఫోజులు ఇచ్చిన తీరు, అటు ఫేస్ ఎక్స్ప్రెషన్స్ కి కుర్రకారు ఫిదా అయిపోతున్నారు. పైగా ఈ ఫోటోలకు దేశి గర్ల్ వైబ్స్ అంటూ క్యాప్షన్ కూడా జోడించింది. ముఖ్యంగా ఈమె అందాలను చూసి ఏఐ జనరేటర్ లాగా ఉంది అని



కామెంట్లు చేస్తుంటే.. మరికొంతమంది లవ్, ఫైర్, స్మైల్ ఎమోజీలను షేర్ చేస్తున్నారు. ఇంకొంతమంది నువ్వే నా జాన్ అని కామెంట్లు పెడుతున్నారు. ఇలా ఎవరికి వారు తమ ప్రేమను ఒలకబోస్తూ కృతి శెట్టి ఫోటోలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కృతి శెట్టి షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ఈ ముద్దుగుమ్మ సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం తమిళంలో ఒక సినిమాలో నటిస్తోంది.





# విద్యార్థులకు సమంత విలువైన సలహా!

చదువు పేరుతో పిల్లలపై పాఠశాలలు, కళాశాలల ఒత్తిడి ఎక్కువవుతోందన్నది వాస్తవం. ర్యాంకుల కోసం బట్టి పట్టించే తీరు మారాలని ప్రభుత్వాలు హెచ్చరిస్తున్నా? అవి అక్కడికే పరిమితమవుతున్నాయి. ఇళ్ల వద్ద తల్లిదండ్రులు కూడా ఒత్తిడి తెస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో? పలు సూచనలు సలహాలు సైతం ప్రభుత్వాలు జారీ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా నటి సమంత ఈ అంశంపై మాట్లాడింది. జీవితానికి మంచి మార్కులు, గ్రేడులే ముఖ్యం కావని మానవతా విలువలు కూడా అంతే అవసరమన్నారు. చదువుతో పాటు మంచి విలువలు ఉండేలా పిల్లలకు అన్ని రకాల విద్యలు నేర్పించాలన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. సమయం దొరకడం లేదని ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దని విద్యార్థులకు సూచించారు. తాను విద్యార్థిగా ఉండి చాలా కాలమైందని.. కానీ ప్రస్తుతం విద్యార్థుల పడుతోన్న బాధలు, ఇబ్బందుల గురించి పత్రికల్లో , సోషల్ మీడియాలో వస్తోన్న వార్తలు చూస్తుంటే గుండె తరుక్కు పోతుందన్నారు. పిల్లలు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారనిపిస్తుందన్నారు. తాను స్కూల్ చదువుకుంటోన్న రోజుల్లో అలాంటివి ఏవీ లేవనిస్నేహం, దయ, సానుభూతి, ఇతరుల పట్ల గౌరవం వంటి లక్షణాలే తనకు జీవితంలో ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు. మంచి మనిషిగా ఎలా ఉండాలో పాఠశాల నేర్పిస్తుందన్నారు. అప్పుడు నేర్చుకున్నవే జీవితంలో ఎలా ముందుకు వెళ్లాలో సహకరిస్తాయంది. జీవితంలో ఎలాంటి పరిస్థితులు ఎదరైనా నిలబడే ధైర్యాన్ని కూడా పాఠశాల దశ నుంచే పిల్లలు అలవాటు చేసుకోవాలన్నారు. ఇలాంటి అంశాలతో కూడిన పాఠ్యాంశాలను జోడిస్తే బాగుంటుందన్నారు. 2023 లో దేశంలో విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగాయన్నారు. మహారాష్ట్రలో అత్యధికంగా కేసులు నమోదయ్యాయని గుర్తు చేసారు. సమంత సామాజిక కార్యక్రమాల్లో కూడా చురుకుగా ఉంటారన్న సంగతి తెలిసిందే. సొంతంగా చారిటీలను కూడా నిర్వహిస్తున్నారు. అనాధశ్రమాలు, పిల్లలను చదివించడం వంటి కార్యక్రమాలు చేస్తున్నారు.ప్రస్తుతం సమంత నటిగా సినిమాలు చేయని సంగతి తెలిసిందే. బాలీవుడ్ లో వెబ్ సిరీస్ లకు పని చేస్తోంది. కొత్త సినిమాలకు సంబంధించి అప్ డేట్స్ త్వరలో వచ్చే అవకాశం ఉంది.

# గ్లామర్ క్వీన్ శోభిత ఎల్ కవర్‌పై కొత్త స్టైల్‌తో సందడి!




గ్లోబల్ బ్యూటీ శోభిత ధూళిపాళ్ల మరోసారి ఇంటర్నేషనల్ ఫ్యాషన్ వేదికపై తన ముద్ర వేసింది. ప్రతిష్టాత్మకమైన 'ఎల్' (జూరాజు) మ్యాగజైన్ 'ది ఆర్ట్ ఇష్యూ' కోసం కవర్ స్టార్గా మారి అందరి దృష్టిని ఆకర్షించింది. తనదైన స్టైల్, గ్రేస్ మరియు అదిరిపోయే యాటిట్యూడ్తో శోభిత చేసిన ఈ ఫోటోషూట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కేవలం గ్లామర్ మాత్రమే కాకుండా, తన ఆలోచనలతో కూడా మెప్పిస్తున్న ఈ బ్యూటీ గురించి మరిన్ని విశేషాలు ఇప్పుడు చూద్దాం. మ్యాగజైన్ కవర్పై మెరుపులు: ఫ్యాషన్ ప్రపంచంలో ఎల్ మ్యాగజైన్ కవర్పై కనిపించడం అంటే సామాన్యమైన విషయం కాదు. శోభిత ధూళిపాళ్ల తన అద్భుతమైన పర్సనాలిటీతో ఆ అవకాశాన్ని దక్కించుకుంది. ఈ షూట్లో ఆమె ధరించిన అవుట్ఫిట్స్, ఆమె ఇచ్చిన పోజులు చాలా ఆర్టిస్టిక్గా ఉన్నాయి. కేవలం నటనతోనే కాకుండా, ఫ్యాషన్ సెన్స్తో కూడా శోభిత తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకుందని ఈ కవర్ పేజీ చూస్తే అర్థమవుతోంది. ఆమె కళ్లలో ఉన్న తీక్షణత, ధరించిన హై-స్లిట్ డ్రెస్ ఫ్యాషన్ ప్రియులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. చాశ్రీంశీ =ముఃం - ఆ హీరోయిన్ దృష్టిలో తమ్ముడే అత్యుత్తమ నటుడు! నటనలో తనదైన ముద్ర: శోభిత కేవలం గ్లామర్ డాల్గా మిగిలిపోవడానికి ఇష్టపడదు. ఆమె ఎంచుకునే పాత్రలు చాలా లోతుగా, ఆలోచింపజేసేలా ఉంటాయి. "మహిళలు విభిన్నమైన మనస్తత్వాలను కలిగి ఉన్నప్పుడే వారు చాలా ఆసక్తికరంగా కనిపిస్తారు" అని ఆమె ఈ ఇంటర్వ్యూలో తెలిపింది.అంటే కేవలం తెరపై కనిపించడం కోసమే కాకుండా, పాత్రలో లీనమై నటించడం తన నైజమని ఆమె చెప్పుకొచ్చింది. 'మేడ్ ఇన్ హెవెన్', 'గూఢచారి', 'మేజర్' వంటి చిత్రాలు ఆమె నటనలోని వైవిధ్యాన్ని ఇప్పటికే చాటిచెప్పాయి. ఈ షూట్ థీమ్ 'ఆర్ట్' కావడంతో, శోభిత తనలోని కళాత్మక కోణాన్ని ఆవిష్కరించింది. తన జీవితంలో క్యూరియాసిటీ అనేది తనను ముందుకు నడిపించే దారి అని ఆమె తెలిపింది. సినిమా అయినా, ఫ్యాషన్ అయినా అందులో కొత్తదనాన్ని వెతకడం ఆమెకు అలవాటు. ఫ్యాషన్ అనేది కేవలం బట్టలు వేసుకోవడం మాత్రమే కాదని, అది ఒక రకమైన భావ వ్యక్తీకరణ అని ఆమె నమ్ముతుంది. అందుకే ఆమె ఫోటోషూట్లు ఎప్పుడూ రొటీన్కు భిన్నంగా, చాలా స్పెషల్గా ఉంటాయి. సోషల్ మీడియాలో వైరల్ ఫోటోలు: శోభిత ఈ ఫోటోలను షేర్ చేసిన కొద్దిసేపటికే అభిమానుల నుంచి భారీ స్పందన లభించింది. ఇక ముఖ్యంగా అక్కినేని నాగచైతన్యతో పెళ్లి తర్వాత ఆమెకు సంబంధించిన ప్రతి అప్‌డేట్ కోసం నెటిజన్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో ఇలాంటి పవర్‌ఫుల్ ఫోటోషూట్‌తో రావడం ఆమె ఫ్యాన్స్‌కు ఫుల్ ట్రీట్ అని చెప్పాలి. కేవలం మన దేశంలోనే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో శోభిత క్రేజ్ పెరుగుతోందనడానికి ఈ ఎల్ మ్యాగజైన్ కవర్ ఒక నిదర్శనం.






NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .